లేఅవుట్లలో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- ఆరు నెలల్లోనే జిల్లాలో 4800 ఇళ్లు పూర్తి
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజాబాబు, కలెక్టర్ శ్రీధర్



దిగువ అబ్బవరంలోని గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ రాజాబాబు, కలెక్టర్ శ్రీధర్

రాయచోటి టౌన్/గాలివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని లేఅవుట్లలో గృహ నిర్మాణాలు పూర్తి చేయడమే కాకుండా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రాజాబాబు, కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించడానికి మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన రాయచోటి మండలం దిగువ అబ్బవరం ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఉన్న లేఅవుట్లు, గాలివీడు మండలం గుర్రాలమిట్ట వద్ద ఉర్దూ పాఠశాల ఎదురుగా ఉన్న హౌసింగ్ లేఅవుట్‌లను కలెక్టర్, గృహ నిర్మాణ కార్పొరేషన్ ఎండీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు ఎన్ని, పూర్తి చేసుకున్నవి ఎన్ని, ప్రగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, ప్రస్తుతం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న గృహాలు ఎన్ని తదితర అంశాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా లేఅవుట్‌లలో మౌలిక వసతులపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. స్థానికంగా నివాసం ఉన్న లబ్ధిదారులతో సమస్యల గురించి చర్చించారు. తాగునీటి సమస్య, అంతర్గత రోడ్ల సమస్యలను లబ్ధిదారులు ఎండీకి, కలెక్టర్‌కు వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎండీ రాజాబాబు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చి గత ఏడాది నాటికే రాష్ట్రంలో లక్ష ఇళ్లు పూర్తి చేయాలన్న లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పనతో పాటు సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని, త్వరలోనే నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఆరునెలల కాలంలోనే జిల్లాలో దాదాపు 4800 ఇళ్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ ఎండీకి వివరించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ శివయ్య, ఈఈలు, డీఈలు, ఏఈలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవస్థతో నిఘా పటిష్ఠం



అధికారులతో కలిసి అటవీ ప్రాంత మ్యాప్‌ను పరిశీలిస్తున్న తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, తదితరులు

- అటవీ శాఖతో కలిసి మాస్ కూంబింగ్ ఆపరేషన్లు
- పీడీ యాక్టుకూ వెనుకాడం
- తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

రైల్వేకోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు సాంకేతిక వ్యవస్థతో నిఘా పటిష్ఠం చేస్తామని తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచనల మేరకు పెంచలకోన, సోమశిల, లంకమల, బద్వేలు, సిద్దవటం, రైల్వేకోడూరుల్లో అటవీ శాఖ అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక చర్యల్లో భాగంగా టాస్క్‌ఫోర్సు నిరంతరాయంగా కూంబింగ్ చేస్తోందన్నారు. అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు కలసి అడవిలో కూంబింగ్ చేస్తాయని తెలిపారు. ఎర్రచందనం బాగా ఉండే అటవీ ప్రాంతాల మ్యాప్‌లను పరిశీలించామని తెలిపారు. స్మగ్లర్లు ఎర్రచందనం రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘా పెడతామని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు, పాత నేరస్తుల కదలికలు తదితర వాటిపై సాంకేతిక వ్యవస్థను ఉపయోగిస్తామని తెలిపారు. అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది కొరత ఉందన్నారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అఘాయిత్యానికి గురైన
చిన్నారులకు వైద్య పరీక్షలు

నిమ్మనపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులపై తండ్రే అఘాయిత్యానికి పాల్పడడంతో ఆ చిన్నారులకు వైద్య పరీక్షలు చేయించినట్లు స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. అభం శుభం తెలియని తన కూతుర్లపై తండ్రి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటనలో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం డీఎస్పీ కొండయ్య ఆదేశాల మేరకు బాధిత పిల్లలకు మదనపల్లి ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.



రాయచోటిలో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్-1 భవనం

పెచ్చులూడుతున్న పైకప్పులు.. ఉరుస్తున్న భవనాలు.. పగిలిపోయిన తలుపులు.. అధ్వాన స్థితిలో వంట గదులు.. మరుగుదొడ్లలోకి ముక్కున వేలేసుకుని పోవాల్సిందే.. ఇలాంటి అసౌకర్యాల మధ్య సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులు చదువును అభ్యసిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేని కారణంగా చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్చేందుకు సుముఖంగా లేకపోవడంతో హాస్టల్స్‌లో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోంది. సిబ్బంది కొరత కారణంగా వాచ్‌మెన్ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది వంట మనుషులుగా, వంట చేయాల్సిన సిబ్బంది వాచ్‌మెన్‌లుగా, కమాటీలుగా వివిధ రకాల అవతారాలు ఎత్తుతూ తప్పనిసరి పరిస్థితుల్లో విధులను కొనసాగిస్తున్నారు.

సమస్యల వలయంలో...

- శిథిలావస్థలో ప్రభుత్వ హాస్టల్స్ భవనాలు
- పెచ్చులూడుతున్న భవనాల పైకప్పులు
- దినదినగండంగా విద్యార్థుల చదువులు
- ఒక్కొక్క హాస్టల్‌లో ఒక్కరే సిబ్బంది
- వెంటాడుతున్న సిబ్బంది కొరత

రాయచోటిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లు సమస్యల లోగిళ్లలో కొట్టుమిట్టాడుతున్నాయి. వసతి గృహ సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారుల అలసత్వం కారణంగా సవాలక్ష సమస్యల నడుమ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నడుస్తున్న పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు దినదిన గండంగా గడుపుతున్నారు. మరికొన్ని హాస్టల్స్ అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కొన్ని హాస్టల్స్‌లో సిబ్బంది ఒక్కరే వన్ మ్యాన్ షో అనే విధంగా అన్ని రకాల పనులను వారే చేసుకుంటూ ఏదైనా ఇబ్బంది జరిగితే కనీసం సెలవుపై వెళ్లేందుకు కూడా వీలు లేకుండా సమస్యలను ఎదుర్కొంటున్నారు. చాలా హాస్టల్స్‌లో సిబ్బంది కొరత వెంటాడుతోంది. వాచ్‌మెన్ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది వంట మనుషులుగా, వంట చేయాల్సిన సిబ్బంది వాచ్‌మెన్‌లుగా, కమాటీలుగా వివిధ రకాల అవతారాలు ఎత్తుతూ తప్పనిసరి పరిస్థితుల్లో విధులను కొనసాగిస్తున్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులకు మాత్రం సిబ్బందితో తమకు పనిలేదు. విద్యార్థులతో పనిలేదు తమకు రావాల్సిన కమీషన్లు వచ్చాయా తమకు రావాల్సిన ఆదాయం వచ్చిందా లేదా అనేవిధంగా వ్యవహరిస్తుండడంతో హాస్టల్స్‌లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. హాస్టల్స్‌లో సరైన సౌకర్యాలు లేని కారణంగా చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను హాస్టల్స్‌లో చేర్చేందుకు సుముఖంగా లేకపోవడంతో హాస్టల్స్‌లో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతోంది. దీంతో చాలా మంది వసతి గృహ సంక్షేమ అధికారులు, విద్యార్థులు హాస్టల్స్‌కు రాకపోవడంతో ఇక్కడ రిజిస్టర్‌లో పేర్లను నమోదు చేస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ వేయించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 55 సంక్షేమ వసతి గృహాల్లో 155 మందికి పైగా సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం వంద లోపు మాత్రమే సిబ్బంది పనిచేస్తుండడంతో కొన్ని హాస్టల్స్‌లో పనిచేస్తున్న సిబ్బందికి కనీసం సెలవులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని రాయచోటికి హాస్టల్‌లో ఒకరిద్దరికి మించి సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులకు వంట వండడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే రాయచోటి పట్టణంలోని ఎస్సీ బాలుర ఒకటవ హాస్టల్‌లో వంటమనిషిగా ఉన్న శంకరయ్య అనే వ్యక్తిని అధికారులు తమ అవసరాల కోసం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయానికి డిప్యూటేషన్‌పై పంపించడంతో 40 మంది విద్యార్థులకు పైగా ఉన్న హాస్టల్‌లో కమాటీగా ఉన్న వ్యక్తే కూరగాయలు తెచ్చుకోవడం, వంట వండడం, విద్యార్థులకు పెట్టడం ఇలా అన్ని పనులు అతనే చేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. దీనికి తోడు చిన్నమండెం మండల కేంద్రంలోని ఉన్న హాస్టల్‌లో పనిచేస్తున్న వంట మనిషిని కూడా రాయచోటి కార్యాలయానికి డిప్యుటేషన్‌తో తీసుకోవడంతో రాత్రి సమయాల్లో విద్యార్థులకు కాపలా కాయాల్సిన వాచ్‌మెన్ వంట మనిషి అవతారం ఎత్తి అన్ని పనులు అతనే చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే రాయచోటిలోని రవి హాల్ సమీపంలో ఉన్న ఎస్సీ హాస్టల్-1లో ఉన్న మహిళా వాచ్‌మెన్ కూడా వంట మనిషి అవతారం ఎత్తి అన్నీ ఆమె చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక్కడ ఉన్న హాస్టల్‌లో పాఠశాల విద్యార్థులతో పాటు కళాశాల, ఐటీఐ విద్యార్థులు కూడా ఉన్నారు. దీంతో అందరికీ ఇక్కడే వసతి ఉండటంతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 55 హాస్టల్స్, 4367 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 55 హాస్టల్స్ నడుస్తుండగా అందులో 4367 మంది విద్యార్థులు భోజన, వసతి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 55 హాస్టల్స్‌లో ప్రీమెట్రిక్ హాస్టల్స్ 44 ఉండగా అందులో 3064 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ఐడబ్ల్యుహెచ్‌సీ హాస్టల్స్ మూడు ఉండగా వాటిలో 674 మంది విద్యార్థులు ఉన్నారు. అంతేగాక కళాశాలకు సంబంధించి పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్ 8 ఉండగా అందులో 629 మంది విద్యార్థులు భోజన వసతి పొందుతున్నారు. అలాగే 48 సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ప్రభుత్వ భవనాల్లో నడుస్తుండగా, 7 హాస్టల్స్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు భయం భయంగా గడుపుతున్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించడం గానీ, మరమ్మతులు గానీ చేపట్టకపోవడంతో భవనాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు భయంగా గడుపుతున్నారు. దీనికి తోడు అద్దె భవనాల్లో నడుస్తున్న సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో అక్కడ ఉంటున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మంత్రి మండిపల్లి చొరవతో రూ.40 లక్షలు మంజూరు

రాయచోటి నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్ మరమ్మతుల కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న ఎస్సీ హాస్టల్‌లో భవనాలు పూర్తి స్థాయిలో శిథిలావవస్థకు చేరుకుని, పైకప్పు పెచ్చులూడడమే కాకుండా తాగునీటి సమస్య కూడా అధికంగా ఉండటంతో స్థానిక నేతలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, వసతి గృహ సంక్షేమ అధికారుల వినతి మరకు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపి నిధుల మంజూరుకు కృషి చేశారు.

మరమ్మతుల కోసం రూ.14 కోట్లు మంజూరు

- జయప్రకాశ్, జిల్లాసాంఘిక సంక్షేమ అధికారి

జిల్లాలో గల 55 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులతో పాటు మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నుంచి రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జిల్లావ్యాప్తంగా చాలా హాస్టల్స్ పాత భవనాలు కావడంతో కొన్నిచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తాగునీటి సమస్య, మరుగుదొడ్లు తదితర సమస్యల పరిష్కారం కోసం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన వెంటనే రూ.14 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. హాస్టల్స్‌లో మరమ్మతుల కోసం ఒకటి రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తాము.



రాయచోటిలోని ఎస్సీ హాస్టల్-1లో అపరిశుభ్రంగా ఉన్న వంట గది



వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

పండ్లవ్యాపారం ముసుగులో..
అక్రమ మద్యం అమ్మకం

- ముగ్గురి అరెస్టు...

రూ.3లక్షల మద్యం స్వాధీనం

కడప క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఐటీఐ ప్రాంతానికి చెందిన రఘురామిరెడ్డి పండ్ల వ్యాపారం చేస్తూ ఆ ముసుగులో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తెచ్చి జిల్లా అంతా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఈ దందా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అతడి ముగ్గురు అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. కడప చిన్నచౌకులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్‌లో ఎక్సైజ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి సూపరింటెండెంట్ రవికుమార్‌తో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. కడప అలంఖాన్‌పల్లెలోని కేసీకెనాల్ సమీపంలో పాండిచ్చేరి, గోవాకు చెందిన మద్యం సీసాలను స్కూటీలో తరలించేందుకు కారులో నుంచి తీస్తున్న సమయంలో ఎక్సైజ్ సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన రఘురామిరెడ్డి ఇతర రాష్ట్రంలో ఉన్న మహేశ్‌తో కలిసి అక్రమంగా మద్యం కడపకు తెప్పించి ఇక్కడ నుంచి జిల్లా అంతటా విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు శాటిలైట్ సిటీలో ఓ ఇంటి వద్ద ఐచర్, టాటా ఏసీ వాహనాల్లో మద్యం సీసాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు రఘురామిరెడ్డి అనుచరులైన కడపకు చెందిన శివ, వెంకటేశ్, మహేశ్‌లను అరెస్టు చేసి కారు, స్కూటీ, ఐచర్, టాటా ఏసీ వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ రూ.3 లక్షలు, వాహనాల ధర రూ.7లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రధాన నిందితుడు రఘురామిరెడ్డి పరారీలో ఉన్నారు. గతంలో ఇతడిపై పీడీ యాక్టు నమోదైందన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, విజిలెన్స్ సీఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాండవుల బావులు

- భీముడి గదాఘాతంతో ఏర్పడ్డ నీటి గుండాలు
- నేటికీ గ్రామ నీటి అవసరాలు తీర్చుతున్న గుండాలు
- భీముడి పేరుతో భీమగుండం గ్రామం

6



ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

- మౌలిక వసతులకు పక్కాగా సర్వే
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

6

ఖరారు కాని రిజర్వేషన్లు

- మార్కెట్ కమిటీల చైర్మన్ స్థానాలపై ఆశావహుల ఎదురుచూపు
- రైల్వేకోడూరు పెండింగ్.. కలెక్టర్ వద్ద ఫైలు

మదనపల్లెటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజకీయ నిరుద్యోగులకు నామినేటెడ్ పదవుల పందేరం సంక్రాంతికి వస్తుందన్న సమాచారం ఆశావహుల్లో ఆనందాన్ని కలిగిస్తోంది. ఓవైపు నాయకుల మధ్య పోటీ పెరిగిపోతుండటం మరోవైపు జిల్లాలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపై రిజర్వేషన్లు ఇంకా ఖరారు కాలేదు. జిల్లాలో 10 మార్కెట్ కమిటీలు, 15 మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులు ఉండగా అందులో రైల్వేకోడూరులో రిజర్వేషన్ ఖరారు కాకపోవడంతో మిగిలిన వాటి రిజర్వేషన్లు కూడా పెండింగ్‌లో పడ్డాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫారసు మేరకు, ఈ ఫైలు కలెక్టర్ వద్ద ఉన్నట్లు తెలిసింది. జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటిలో మదనపల్లె, అంగళ్లు, ములకలచెరువు, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి పెద్దసంఖ్యలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం నాయకులు ఆరాటపడుతున్నారు.

ఖరారు కాని రిజర్వేషన్లు

జిల్లాలో 10 మార్కెట్ కమిటీలు ఉండగా వీటి చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు కేటాయించారు. 10 చైర్మన్ పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎస్సీ వర్గానికి ఒకటి, ఎస్టీ వర్గానికి ఒకటి, బీసీ వర్గానికి మూడు పోను మిగిలిన ఐదు జనరల్ క్యాటగిరీ వర్గానికి చైర్మన్ పదవులు కేటాయించాలి. అందులోనూ ఐదుగురు మహిళలు తప్పనిసరిగా ఉండాలి. జనరల్ క్యాటగిరీకి చెందిన వారి నుంచి పోటీ ఎక్కువగా ఉంది. విశ్వసనీయ సమాచారం మేరకు... అన్ని నియోజకవర్గాల్లో చైర్మన్ రిజర్వేషన్‌లు పూర్తి కాగా ఒక్క రైల్వేకోడూరులో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. సంక్రాంతి పండుగకు కూటమిలోని నాయకులకు ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు కేటాయించాలని సీఎం చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించినట్లు సమాచారం.



మదనపల్లె మార్కెట్ కమిటీ కార్యాలయం

త్వరలో రిజర్వేషన్లు ఖరారు

మార్కెట్ కమిటీల పాలకవర్గం చైర్మన్లు, డైరెక్టర్ల రిజర్వేషన్ల ప్రక్రియ రెండు మూడు రోజుల్లో పూర్తవుతుంది. ఇప్పటికే ఫైలు కలెక్టర్‌కు సమర్పించాము. ప్రజాప్రతినిధులతో చర్చించి తుది నిర్ణయానికి వస్తాము.

-త్యాగరాజు, ఏడీఎం, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, రాయచోటి

ఆదాయంలో మదనపల్లెది ప్రథమ స్థానం

జిల్లాలోని మార్కెట్ కమిటీల్లో మదనపల్లె మార్కెట్ కమిటీ వార్షిక ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఏడాదిలో మదనపల్లె మార్కెట్ కమిటీ ఆదాయం లక్ష్యం రూ.2.04 కోట్లు ఉండగా, ములకలచెరువు రూ.1.24 కోట్లు, రైల్వేకోడూరు రూ.కోటి, వాల్మీకిపురం రూ.90 లక్షలు, లక్కిరెడ్డిపల్లె రూ.83 లక్షలు, రాజంపేట రూ.65 లక్షలు, కలికిరి రూ.54 లక్షలు, పీలేరు రూ.35 లక్షలు, అంగళ్లు రూ.30 లక్షల ఆదాయం లక్ష్యంగా పనిచేస్తున్నాయి. గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఆదాయ లక్ష్యం దాదాపు 80 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ రూపానందరెడ్డి

- ఎమ్మెల్యే అరవ శ్రీధర్


రైల్వేకోడూరు(రూరల్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కడప-తిరుపతి ప్రధాన రహదారి రోడ్డు మరమ్మతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కుక్కలదొడ్డి పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిలో జరుగుతున్న రోడ్డు మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంతలు లేని ప్రయాణానికి అనుకూలమైన రోడ్ల నిర్మాణమే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ నాటికి మరమ్మతుల పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

బంగారు షాపు యజమానికి బురిడీ

- 22 గ్రాముల బంగారు అపహరణ

6


పాండవుల బావులు


గుండంలోని నీరు

- భీముడి గదాఘాతంతో ఏర్పడ్డ నీటి గుండాలు
- నేటికీ గ్రామ నీటి అవసరాలు తీర్చుతున్న గుండాలు
- భీముడి పేరుతో భీమగుండం గ్రామం

పెద్దముడియం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం వరకూ గ్రామాల్లోని జనం నీటి అవసరాలను దిగుడు, చేదుడుబావులు తీర్చేవి. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బావులు కాస్త కనుమరుగయ్యాయి. తరువాత 200 నుంచి 500 అడుగుల లోతులో ఉన్న పాతాళగంగను చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు ద్వారా నీటిని తోడుకుని జనం నీటి కష్టాలు తీర్చుకునేవారు. ప్రస్తుతం ఉపరితల నీటి ట్యాంకులు వచ్చి పైపులైన్ల ద్వారా ఇళ్ల వద్దకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం భూగర్భజలాలు వందల అడుగుల లోతుల్లోకి పడిపోయాయి. బావులు, బోర్లు, చేతిపంపులు కనుమరుగయ్యాయి. అయితే పెద్దముడియం మండలంలోని ఆ గ్రామంలో మాత్రం కొండ ప్రాంతంలో నేటికీ ఐదు నుంచి పది అడుగుల లోతులో జలకళతో నీటి గుండాలు కొన్ని దర్శనమిస్తున్నాయి. చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు, నీటి ట్యాంకులు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా నేటి వరకు ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి. ఎప్పుడో శతాబ్దాల క్రితం ఈ నీటిగుండాలు ఏర్పడ్డాయి. మా పూర్వీకులు చెప్పే వారంటూ గ్రామస్థులు అంటున్నారు. పెద్దముడియం మండలంలోని కొండ ప్రాంతంలో గల భీమగుండం గ్రామానికి ఓ చరిత్ర ఉందని పూర్వీకులైన మా పెద్దలు చెప్పేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. భీమగుండం గ్రామం కొండ ప్రాంతం. ఈ ప్రాంతంలో పూర్వం దట్టమైన అటవీ ప్రాంతం ఉండేదని, మహాభారత కాలంలో పాండవులు వారి వనవాస సమయంలో ఈ ప్రాంతంలో సంచరించారని, ఆ సమయంలో పాండవులకు నీటి సమస్య వచ్చింది. ఎక్కడా నీటి జాడ కనిపించలేదు. దీంతో దర్మరాజు ఆదేశానుసారం భీముడు తన గదాఘాతంతో కొండ ప్రాంతంపై గట్టిగా కొట్టడంతో ఆ దెబ్బకు నీటి గుండాలు ఏర్పడ్డాయి. ఆ నీటి గుండాల్లోని నీటితో వారి అవసరాలు తీర్చుకుని వెళ్లిపోయారు. తరువాత కాలంలో ఆ నీటి గుండాల్లోని నీటిని ఆసరాగా చేసుకుని కొందరు జనాలు జీవనం సాగించేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇలా ఏర్పడ్డ జన సమూహంతో అది గ్రామంగా మారింది. ఇలా భీముడి గదాఘాతానికి ఏర్పడ్డ గుండాల ద్వారా ఏర్పడిన గ్రామానికి భీమగుండంగా నామకరణం అయిందని గ్రామస్థులు తెలుపుతున్నారు. విచిత్రమేమంటే దశాబ్దాల కాలంలోనే భూగర్భజలాలు అడుగంటి బావులు బోర్లు ఎండిపోతున్న ఈ తరుణంలో భీమగుండంలోని నీటి గుండాలు అత్యంత తక్కువ లోతులోనే జలకళతో కనిపిస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా గ్రామస్థులు ఈ గుండాల్లోనే నీటిని ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తినప్పుడు వ్యవసాయ అవసరాల కోసం గుండాల్లో నీటిని ప్రజలు ఉపయోగిస్తున్నారు. ఈ గుండాల చుట్టూ రక్షణగా ప్రహరీలు నిర్మించారు. అయితే కొన్ని గుండాలకు ప్రహరీ లేకపోవడంతో చెత్త చెదారంతో నిండాయి. ఈ గుండాల్లో నీటిని తోడుకునేందుకు అనువుగా అప్పట్లో తాపలు కూడా ఏర్పాటు చేశారు. భీముడి పేరుతో ఏర్పడ్డ నీటి గుండాలు నేటికీ ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి.

ఫిల్టరు నీళ్ల కంటే రుచిగా ఉంటాయి



పాండవుల కాలంలో ఈ నీటి గుండాలు ఏర్పడ్డాయని మా పెద్దలు చెబుతుంటారు. ఈ గుండాల్లో నీరు ఎంతో స్వచ్ఛంగా ఫిల్టర్ల నీటి కంటే రుచిగా ఉంటాయి. ఇప్పటికీ ఈ నీటిని ఉపయోగిస్తున్నాం. గ్రామంలో నీళ్ల సమస్య వస్తే అందరం నీటి గుండాలను ఆశ్రయించాల్సిందే. భీముడి గదతో కొట్టగా ఏర్పడ్డ గుండాల కారణంగా భీమగుండం గ్రామం పేరు వచ్చిందని మా పెద్దలు చెప్పేవారు.

-వెంకటేశ్వర్లు, భీమగుండం

వంతులవారీగా నీళ్లు తీసుకెళ్లేవారం



గ్రామంలో కుళాయిలు ఏర్పాటు కాక ముందు అందరం ఈ గుండాల నీటి వద్దకు వెళ్లి క్యూలైనులో నిలబడి వంతుల వారీగా కడవలు, బిందెలతో నీళ్లు ముంచుకుని తీసుకువచ్చేవారం. నీళ్లు చాలా స్వచ్ఛంగా ఉండేవి. ప్రస్తుతం కుళాయిలు, ఫిల్టరు నీళ్లు వచ్చాక గుండాల్లో నీటి వాడకం తగ్గింది. అయితే కుళాయి నీరు రాకపోతే ఈ గుండాల వద్దకే వెళ్లి నీరు తెచ్చుకుంటాం. వర్షాకాలంలో నీటి గుండాల్లో నీరు పొంగి వీధుల్లో పారుతాయి.

- సరస్వతి, భీమగుండం


గుండంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాపలు


గదతో కొట్టినట్లుగా కనిపిస్తున్న గుండం


గ్రామంలో ఉన్న అతి పెద్ద నీటి గుండం


నీటి గుండం చుట్టూ రక్షణ గోడ

‘అన్నమాచార్య’లో వైభవంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి
- 9న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాక



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా గంగిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యాలయాలను ప్రారంభించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను మంగళవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యాసంస్థల అధినేత, అన్నమాచార్య యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మన్ సి.రామచంద్రారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట లాంటి చిన్న పట్టణంలో అన్నమాచార్య విద్యాలయాలను 25 ఏళ్ల కిందట ప్రారంభించి నేడు యూనివర్సిటీ స్థాయికి తీసుకు రావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఉత్తమ శిక్షణ, ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా ఈ విద్యాలయాలను ప్రారంభించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత సంగీత కళాకారుడు రామ్ మిరియాల మ్యూజిక్ విద్యార్థులను ఎంతో అలరించింది. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జున రావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ జయరామిరెడ్డి, డీన్ సుబ్బారావు, సుమారు 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ రాక

అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈనెల 9వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరవుతున్నట్లు యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. అదేరోజు ఉత్సవాలకు ప్రముఖ హాస్యనటుడు కె.బ్రహ్మానందం హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌చౌదరి, తెలుగు సినిమా హీరో కిరణ్ అబ్బవరం హాజరవుతున్నట్లు తెలిపారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ బుధవారం సాయంత్రం జరిగే కార్యక్రమాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సతీష్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు వేలాదిమంది విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రాజంపేట పట్టణంలో భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీకి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

మౌలిక వసతులకు పక్కాగా సర్వే చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులు, వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం మంతన్ శివిర్‌లో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో దర్తీ అభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద జిల్లా మంతన్ శివిర్ సమావేశం నిర్వహించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. 25 అంశాల్లో గిరిజనులు, వారి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని 17 శాఖలకు నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రతిశాఖ రాబోయే ఐదు సంవత్సరాల్లో షెడ్యూల్ తెగల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్టీలకు కేటాయించిన నిధుల ద్వారా నిర్దిష్ట కాల పరిమితిలో పథకాల అమలును పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు జిల్లాలో 50 శాతానికి పైబడి గిరిజనుల జనాభా ఉన్న పెనగలూరు, కోడూరు, లక్కిరెడ్డిపల్లె, కురబలకోట 4 మండలాల్లో 17 గ్రామాలు పథకాల సంతృప్త అమలుకు ఎంపిక చేయబడినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలో గల 17 గ్రామాల్లోని సచివాలయాల్లో ఆయా పంచాయతీల వారీగా ఎస్టీ గృహాలు, వారి జనాభాను గుర్తించి రెండు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారిణి తేజస్విని, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యం, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ పోటీలు విజయవంతం


ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల విజేతలతో అధ్యాపకులు

రాయచోటిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమ కో-ఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ పోటీలు ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో హసీషా, డ్రాయింగ్‌లో ఎస్ఎండీ తౌసిఫ్, చేతిరాత పోటీలో భవ్యశ్రీ, రంగోళి పోటీల్లో ఐశ్వర్య, జానపద నృత్యంలో నాగనిషిత బృందం, డిజిటల్ కోల్లాజ్‌లో హర్షిత, స్లోగన్ రైటింగ్‌లో ప్రవల్లిక, రోల్‌ప్లే పోటీలో చైతన్య విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను మొత్తం 8 విభాగాల్లో నిర్వహించారు. ఒక్కో విభాగంలో మొదటి స్థానాన్ని పొందిన వారు జనవరి 24న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు డైట్ కళాశాల అధ్యాపకులు శివభాస్కర్, శ్రీదేవి, అసదుల్లా, నాగరాజు, నాగేశ్వరరావు, ప్రకాశ్‌రెడ్డిలు జడ్జిలుగా వ్యవహరించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర పోషించిన కో-ఆర్డినేటర్లు, నిర్వాహకులకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బంగారు షాపు యజమానికి బురిడీ

- నకిలీ బంగారం ఇచ్చి... 22 గ్రాముల బంగారు నగలు పట్టుకెళ్లారు...
- సీసీ టీవీలో ఇద్దరు మహిళల గుర్తింపు



నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన మహిళలు

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బంగారంతో ఇద్దరు మహిళలు నగల వ్యాపారినే బురిడీ కొట్టించిన ఉదంతం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజంపేట పట్టణంలోని పాత పోలీసు లైనులో మహీద్‌ఖాన్ అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ఆయన దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు తమ వద్ద ఉన్న పాత నగలు ఇచ్చి వాటికి బదులుగా కొత్త నగలు కొనుగోలు చేశారు. వారు తెచ్చిన నగలపై హాల్‌మార్కు ఉండడంతో షాపు యజమాని జాగ్రత్తగా పరీక్షించకుండానే తీసుకున్నారు. సోమవారం ఆ నగలను కరిగించగా అది బంగారం కాదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన షాపు యజమాని సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కిలాడీ లేడీలు అపహరించిన బంగారు విలువ సుమారు 1.70 లక్షలు ఉంటుందన్నారు.

రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా బీసీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ వివిధ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందించే వివిధ రకాల రుణాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, తదితర వివరాలను కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు రూ.34 కోట్లు బీసీ కార్పొరేషన్, ఈబీసీ, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ మహిళ మృతి

- 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడి...


తులసమ్మ (ఫైల్)

రామసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం గోవింద మాల వేసి కాలినడకన తిరుమలకు వెళ్తున్న భక్తులను సోమవారం ఉదయం తిరుపతి సమీపంలో 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన తులసమ్మ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలు మండలంలోని మాలేనత్తం గ్రామ పంచాయతీ చింపరపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి భార్య. సోమవారం 108 వాహనం ఢీకొన్న ఘటనలో తులసమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రిలో చేర్చారు. ఇదే ఘటనలో సోమవారం ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విదితమే. కాగా మృతి చెందిన మహిళ దహనక్రియలు సోమవారం చింపరపల్లె, సింగంవారిపల్లెలో జరగ్గా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మృతి చెందిన ఒక్కొక్క మహిళ కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి


మృతి చెందిన నరేశ్

మదనపల్లె అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన బసినికొండలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన పెయింటర్ నరేష్ (30) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను సంఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నరేష్ మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలోకి వెళ్లి పనిముగించుకుని తిరుగు ప్రయాణంలో రామాచార్లపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బసినికొండ శివాలయం వద్ద నిమ్మనపల్లె నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి శవ పరీక్ష కోసం తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేకోడూరు క్రీడాకారులకు బ్యాడ్మింటన్‌లో మొదటి ర్యాంకు



రైల్వేకోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ షటిల్ బాడ్మింటన్ (జూనియర్ విభాగం) పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థులు గొబ్బూరు విశ్వతేజ్, అరిగిల భార్గవ్‌రాం మొదటి ర్యాంకు సాధించారు. మహారాష్ట్రలోని పూణెలో షటిల్ బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబరులో అంతర్జాతీయ స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈనెల 5న ఈ ఏడాదికి మొదటి ర్యాంకును బీడబ్ల్యూఎఫ్ (బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్) ప్రకటించినట్లు విద్యార్థులు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో రెండు సార్లు మొదటి స్థానంలో నిలవడంతో ఈ ర్యాంకు లభించిందని వారు తెలిపారు.


ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్ లేక...

- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- బయటి ఫుడ్ కోసం వెంపర్లాట
- రాజకీయ ఒత్తిడితో ముందుకు సాగని క్యాంటీన్‌ల ఏర్పాటు

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మూడు నెలలుగా విద్యార్థులు ఆహారం కోసం ఇబ్బంది పడుతున్నారు. క్యాంపస్‌లోని క్యాంటీన్లకు అలవాటుపడ్డ విద్యార్థులు అవి మూతపడడంతో బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. మెస్‌లలో ఆహారం అందిస్తున్నప్పటికీ మొదటి నుంచి క్యాంటీన్‌లోని ఆహారానికి అలవాటుపడ్డ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు నెలలల క్రితం మూసివేశారు. కొత్తగా తిరిగి ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అయితే మూడు నెలలు కావస్తున్నా క్యాంటీన్లు ఏర్పాటు కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక దశలో విద్యార్థులు ఆందోళన కూడా చేపట్టారు. సర్దిచెప్పిన అధికారులు బయటిఫుడ్ తెప్పించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ బయట ఫుడ్ ద్వారా విద్యార్థులకు ఏదైనా సమస్య ఉత్పన్నమవుతుందేమోనని తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంది. క్యాంపస్‌లో క్యాంటీన్లు లేకపోవడం వల్లే విద్యార్థులు బయటఫుడ్‌కు ఎగబడుతున్నారు. అధికారులు క్యాంటీన్లు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా...

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటులో రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఏర్పాటైన క్యాంటీన్లు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వంలోని రెండు వర్గాలు, వైసీపీ వారు క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి ఎంత కేటాయించాలనే విషయంపై ట్రిపుల్‌ఐటీ అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికి వారు తమకే కావాలంటూ ఆరు పార్టీల నేతలు పట్టుబడుతున్నారు. దీంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్రిపుల్‌ఐటీ అధికారులు ఏదొక నిర్ణయం తీసుకొని వెంటనే క్యాంటీన్లను ఏర్పాటు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

డైరెక్టర్ ఏమన్నారంటే..

క్యాంటీన్ల ఏర్పాటు జాప్యంపై డైరెక్టర్ కుమారస్వామి గుప్తను అడగ్గా.. త్వరలోనే క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని అందుకు తగ్గ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత కొద్ది వారాలుగా డైరెక్టర్ ఇదే విషయాన్ని చెబుతున్నారు. అయితే ఆచరణలో క్యాంటీన్లు ఏర్పాటు కావడం లేదు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- మహాధర్నాలో నినదించిన అంగన్వాడీలు


కడప కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో అంగన్వాడీలు, సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని అంగన్వాడీలు నినదించారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లాలు మాట్లాడుతూ పనిభారం పెంచుతూ, నిత్యం నిత్యావసర సరుకులు ధరలు, డీజల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, విధులలో చనిపోయిన వారికి రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ వెంటనే అమలు చేయాలని, గౌరవ వేతనాలు బిల్లులు ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు అందరికీ వర్తింపజేయాలన్నారు. కాగా, కడప నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టి మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నాయకులు విజయ, సుజాతమ్మ, యశోద, శ్రీదేవి, ప్రసన్న, పార్వతి, రజని, శివనారాయణమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్‌తో వైవీయూ ఒప్పందం


ఒప్పంద పత్రాలతో వీసీ కృష్ణారెడ్డి, సీఈఓ తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్నోవేట్ సైబర్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో (హైదరాబాద్) పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ సీఈఓ మోనిక, ఎండీ అభిమాన్యు రావు, ప్రోగ్రాం డెవలపర్ మందూరు అయ్యప్ప, యోగివేమన యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ ప్రముఖ సంస్థలకు, పరిశ్రమలకు మానవ వనరులను అందించే సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ విద్యార్థులను నైపుణ్యత గల వారీగా తయారు చేస్తారని తెలిపారు. అలానే ఉద్యోగ అవకాశాలకు ప్రమోట్ చేస్తారని వివరించారు. సీఈఓ మౌనిక మాట్లాడుతూ రెండేళ్ల పాటు ప్లేస్‌మెంట్ శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు ప్లేస్‌మెంట్‌లను అందించడంలో సహాయపడుతామన్నారు. ఇఫిషియల్ ఇంటలిజెంట్, సెయిల్ పాయింట్, సైబర్‌ఆర్క్, ఒరాకిల్, హెచ్‌సీఎం, శాప్ ఏఐ, శాప్ ఎండీజీ, మెషిన్ లర్నింగ్, డేటా సైన్స్ పైథాన్ జాంగో, శాప్ ఇంటోన్, ఫుల్‌స్టాక్ పైతాన్, వెబ్ డెవలెంట్, బ్లాక్ చైన్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూట్ మొదలైన కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో ప్రజా సంబంధాల విభాగం సచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి


విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, రైతులు

చెన్నూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతు తాను సాగు చేసే పంటలో అధిక దిగుబడులు సాధించి లాభపడేందుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరపు సుబ్బారెడ్డి అన్నారు. కడప నగరానికి వచ్చిన ఆయనను మంగళవారం చెన్నూరుకు చెందిన పలువురు రైతులు, టీడీపీ నేతలు కలిసి రైతుల శ్రేయస్సు కోసం నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రతి రైతు బాగుపడాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబు ప్రతి రైతు కోసం ఎంతో తపిస్తున్నాడని.. రైతు బాగున్నప్పుడు రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశ్యంతో ఇప్పటి నుంచే విత్తనాభివృద్ధి సంస్థను ముందుకు తీసుకెళ్లి అన్ని గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. గత ప్రభుత్వంలో విత్తనాభివృద్ధి సంస్థ పరంగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా రైతు సాగులో ఖర్చులు తగ్గించుకునేందుకు రైతు భరోసా రూ.20వేలకు పెంచి ఇవ్వబోతున్నట్లు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఐ.శివారెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, రైతు నేతలు వెంకటసుబ్బయ్య, కుంచెం రామక్రిష్ణరెడ్డి, ముండ్లపల్లె శ్రీనివాసులరెడ్డి, హనుమంతురెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, సంజీవరాయుడు, శివయ్య, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా

- భారీగా తరలివచ్చిన ముస్లింలు


ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న ఉలేమాలు

ఆత్మకూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మ కూరు కేంద్రంగా మూడు రోజుల పాటు జరగనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీశై లం రస్తాలోని సుమారు వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇజితెమా ప్రాంగణానికి కర్నూ లు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. మధ్యాహ్నం ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఆధ్మాత్మిక ప్రవచనాలను, మహ్మద్ ప్రవక్త నిర్ధేశించిన మార్గదర్శకాలను వినిపించారు. తొలిరోజు మధ్యాహ్నం, సాయం త్రం, రాత్రి వేళల్లో ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. ఇదిలావుంటే వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికోసం ఇజితెమా నిర్వహణ కమిటీ భారీ ఏర్పాట్లను సిద్ధం చేసింది. వంద ఎకరాల్లో ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నమాజులు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలను కల్పించారు. అలాగే విద్యుద్దీకరణతో పాటు భారీ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. అదే క్రమంలో సుమారు 5వేల మరుగుదొడ్లు, స్నానపుగదులు, 17భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా రూట్లలో 18చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పా టు చేసి ట్రాఫిక్‌జామ్ సమస్య వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో బస్టాండ్‌కు చేరుకున్న వారికి ప్రత్యేక వాహనాల్లో ఇజితెమా ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు కల్పించారు. కాగా మంగళవారం రాత్రికి ఇజితెమా ప్రాంతానికి అధిక సంఖ్యలో ముస్లింలు తరలి వచ్చారు. బుధవారం ఉదయం నుంచి భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు.

వరుస విజయాలతో.. సత్తా చాటిన కడప జట్టు

- మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయకేతనం

కడప స్పోర్ట్స్ జనవరి 7, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్- 12 బాలుర అంతర్ జిల్లాల సౌత్‌జోన్ క్రికెట్ పోటీలలో కడప జట్టు వరుసగా రెండో విజయం సాధించి సత్తా చాటింది. అలాగే నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో గెలు పొందింది. వివరాలిలా.. నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో భువన్ సాయి 54 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 25.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో తాహీర్ 35, యోగాంజనేయులు 32, విష్ణువర్ధన్‌రెడ్డి 31 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 7 వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని ఖాతాలో వేసుకుంది.


ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తలపడుతున్న నెల్లూరు- కర్నూలు జట్లు



భువన్‌సాయి (54 పరుగులు), జాన్‌సన్ (53 పరుగులు)

కర్నూలుపై నెల్లూరు జట్టు గెలుపు

రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 141 పరుగులు చేసింది. ఇందులో జాన్‌సన్ 53 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురువేసింది.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

కడప మారుతీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గోదావరి, పెన్నా నదులను అనుసాంధానం చేయాలని సంకల్పించడం హాస్యాస్పదంగా వుందన్నారు. వెనుకబడిన ప్రాంతం రాయలసీమలో పెండింగ్‌లో వున్న హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నదుల అనుసంధానం ప్రక్రియ చేపట్టాలని భావించడం అవివేకమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, నదుల అనుసంధానం అనే అంశంపై మంగళవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదట పెండింగ్‌లో వున్న 55 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి 33 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. గోదావరి-కృష్ణ-పెన్నా నదుల అనుసంధానం పేరుతో 80వేల కోట్లతో ప్రభుత్వం పథకం రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కొరకు నిధుల సాయానికి పంపుతున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా 385 టీఎంసీల నీటిని కృష్ణకు మళ్లించి రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతున్న తీరు విడ్డూరంగా వుందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, సత్తార్, గుర్రప్ప, అంజి, శంకర్, సుబ్బరాయుడు, దేవర శ్రీకృష్ణ, జయవర్ధన్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పకడ్బందీగా పోలీసు నియామక పరీక్షలు

కడప క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసునియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను 7వ రోజు మంగళవారం ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుకానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. 7వ రోజు మంగళవారం 600 మంది అభ్యర్థులకు 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. ప్రతిరోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతివంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారు. తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారు. దేహదారుఢ్యపరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.




పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ, పరిగెడుతున్న అభ్యర్థులు

ఇంత నిర్లక్ష్యమా..

- పూడిక తీశారు.. పై కప్పు మరిచారు
- కాలువలో పడిపోయిన మహిళ
- బద్వేలు మున్సిపాలిటీ తీరుపై స్థానికుల ఆగ్రహం

బద్వేలు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ సంఘటన నిలుస్తోంది పట్టణపరిధిలోని స్థానిక నెల్లూరు రోడ్డు ప్రధాన రహదారిలో గల ఓ కేఫ్ ముందు భాగంలోని కాలువలో మున్సిపల్ సిబ్బంది పూడికతీత పనులు చేశారు. తిరిగి కాలువలకు పైకప్పు వేయకపోవడంతో ఓ మహిళ ఆ కాలువలో పడి గాయ పడింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీ ఫుటేజ్‌లో రికార్డు కావడం.. ఇది సోషియల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల, సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద కాలువలో పూడికతీసి వదిలేయడంతో వాహనాలు కాలువలో ఇరుక్కుపోతు న్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూడికతీసిన మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ కొరవడ టంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్

- ఏపీఎన్‌జీసీ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్ అని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ క్రాఫ్ట్ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి (ఐఏఎస్) తెలిపారు. మంగళవారం కడప నగరం బాలవికాస్, నాగార్జున మోడల్ స్కూల్ పాఠశాలల్లో విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణం గొప్పతనాన్ని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో ఒక మొక్కను దత్తకు తీసుకోవడం వల్ల ఆ మొక్క మానుగా మారి పర్యావరణానికి నాంది పలుకుతుందన్నారు. అనంతర నాగార్జున మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ క్రాఫ్స్) విశిష్టతను వివరించారు. ఏపీఎన్జీసీ పీఓ సత్యనారాయణ, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

‘డబ్బుకోసం మనవడే హతమార్చాడు’

మైదుకూరు రూరల్, జనవ రి 7 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) గత నెల ఆరవ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే జనవరి 2వ తేదీ వీరారెడ్డి రెండవ భార్య కుమారుడు కుమ్మరి రమేష్ మా నాన్నది సహజ మరణం కాదని విచారణ చేపట్టాలని మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 4వ తేదీ ఉన్నతాధికారుల సమక్షంలో మృతుడు వీరారెడ్డి శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. విచారణలో భాగంగా శెట్టివారిపల్లెలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజ్ ప్రకారం వీరారెడ్డి మనవడైన అల్లాడుపల్లె హరినాథ్‌రెడ్డి, అతని స్నేహితుడు కాలువపల్లి నరసిహులు ఇద్దరు కలిసి డబ్బుల కోసమే వీరారెడ్డిని చంపినట్లు విచారణ తేలిందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

జీతాలు పెరుగుతాయని మోసగింపు

ముద్దనూరు జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కంపెనీ అభివృద్ధి చెందితే.. జీతాలు పెరుగుతాయంటూ కంపెనీ యాజమాన్యం మోసగించి డబ్బులు వసూలు చేసిందని మంగళవారం మంగపట్నం గ్రామానికి చెందిన రాళ్లపల్లి మంజునాథ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు వివరాలు.. మంగపట్నం గ్రామానికి చెందిన మంజునాథ బెంగళూరులోని ఈడీ వేదా ఎడ్యుకేషన్ కంపెనీలో అకౌంట్ సెక్షన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కంపెనీకి చెందిన యాజమాన్యం సాయిచరణ్ అతని భార్య రేష్మ కంపెనీ అభివృద్ధి చెందితే అందరికీ జీతాలు పెరుగుతాయని మోసగించారు. మంజునాథ వద్ద నుంచి రూ.10,62,620 తీసుకొని మోసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సౌమ్యనాథాలయ హుండీ ఆదాయం రూ.2,29 లక్షలు


హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

నందలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సౌమ్యనాథస్వామి ఆలయానికి హుండీ ద్వారా 2,29,555 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీ‌ప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నెల రోజుల వ్యవధిలో హుండీని లెక్కించామన్నారు. మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామ ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్‌సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనితదీప్తి


ఎస్‌సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దుద్యాల అనితదీప్తి

రైల్వేకోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దుద్యాల అనితదీప్తి మంగళవారం విజయవాడ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులకు న్యాయం చేసేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.

పంట రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలోని కౌలు రైతులు పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎల్‌డీఎం ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీ సీజన్ త్వరలో ముగుస్తున్న సందర్భంగా జిల్లాలోని కౌలు రైతులు రాబోయే సీజన్ కోసం పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దగ్గరలోని ఏదైనా బ్యాంకుకు వెళ్లి సంప్రదించాలన్నారు. రుణాలను పొందే క్రమంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే 08561293903 నెంబరును సంప్రదించవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గణితం టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల హవా

రాయచోటిటౌన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాయల సీమ జోన్ స్థాయి గణితం టాలెంట్ టెస్టులో ఓ కోచింగ్ సెంటర్‌లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు బీ. జోషిత ప్రథమ స్థానంలో నిలిచి రూ.20వేలు, హంసీహా, చర్విత రెండో స్థానంలో నిలిచి ఒక్కొక్కరు రూ 10 వేలు చొప్పున బహుమతులు సాధించారు. రాఘవేంద్ర, గంగాసాగర్, ఉజ్మా తబస్సుమ్ థర్డ్ ర్యాంకులు సాధించి రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు పొందారు.

రైతు సంఘం మహాసభను జయప్రదం చేయాలి

చిట్వేలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో నిర్వహిస్తున్న రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రైల్వేకోడూరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు నాయకులు తిప్పన ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం చిట్వేలిలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శివ, సుబ్బరాయుడు, దేవి, వెంకట సుబ్బమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జిలతో.. సమస్యల పరిష్కారమెలా?

● సిద్దవటం మండల ప్రజల ఆవేదన

సిద్దవటం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జిల పాలన కారణంగా రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, వివిధ రకాల సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం చేసుకుంటోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇక్కడికి బదిలీ అయిన తహసీల్దారు మురాషావలి అక్టోబరు నెల 31న రిటైరయ్యారు. దీంతో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తున్న మాధవీలతను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక సాధారణ బదిలీల్లో భాగంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమితుడైన సుబ్బారెడి ప్రస్తుతం డెప్యుటేషన్‌పై కడప కలెక్టరేట్‌కు వెళ్లాడు. దీంతో సీనియర్ అసిస్టెంట్ నరసింహప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ పరిస్థితిలో మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, విద్యార్థులు, ప్రజలకు సంబంధించిన వివిధ రకాల సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. ఆర్టీఐ దరఖాస్తులకు సైతం గడువులోగా సమాచారం ఇవ్వకపోవడంతో కడప డివిజనల్ అధికారికి అప్పీల్ చేయడం పరిపాటిగా మారింది. కాగా, నెల రోజులుగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలను 45 రోజుల వ్యవధిలో పరిష్కారానికి నోచుకుంటాయో లేవో వేచి చూడాల్సిందే. ఇక మండల పరిధిలోని కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇన్‌చార్జి అధికారులు ఈ ఆక్రమణలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను గమనించి మండలంలో రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దారు కార్యాలయం

స్కీం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రాయచోటి కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధమైన స్కీం వర్కర్స్ యూనియన్ల జాతీయ సమితి పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విషయంలో అతి కీలకంగా పనిచేస్తున్న స్కీం కార్మికులు అంగన్వాడీ, ఆశా, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల వేతనాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, వారిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్కీం కార్మికులకు రూ.26 వేలు వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులు పనిచేసే చోట పని భద్రత లేదని అనేక అవమానాలకు గురవుతున్నారని, పని ఒత్తిడితో అనేక మంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సరోజమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, యశోద, స్వర్ణ, సుజాత, రమణమ్మ, సీత, జయలక్ష్మి, నిర్మల, వెంకటరత్నమ్మ, సుమతి, నీలావతి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో 'మోదీ గో బ్యాక్'

రాయచోటిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిన దేశ ప్రధాని నరేంద్రమోడీ గో బ్యాక్ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు నినాదాలు చేశారు. మంగళవారం రాయచోటి బస్టాండు సమీపంలో ఆయన మాట్లాడుతూ తమ స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని అడ్డుగోలుగా విభజించడమే గాక, విభజన హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. కడప ఉక్కు కర్మాగారాన్ని శంకుస్థాపనలతోనే సరిపెట్టారని ఆరోపించారు. వెనుక బడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని, ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్ల వరకు ప్రత్యేక హోదా కల్పిస్తామని, పరిశ్రమలు తెస్తామని చెప్పిన మోడీ, నేడు విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా తెగనమ్మడానికి ప్రయత్నిస్తుంటే పాలక, ప్రతిపక్షాలు డూడూ బసవన్నలాగా వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మత ఘర్షణలకు అడ్డాగా మారుతున్న నేపథ్యంలో మోడీ గో బ్యాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం స్థానిక కార్యదర్శి మాధవయ్య, నాగబసిరెడ్డి, సీఐటీయూ నాయకులు చెన్నయ్య, సురేంద్ర, బాషా, రెడ్డెయ్య, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన

సిద్దవటం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మండలంలోని మాధవరం -1 గ్రామం రామకృష్ణాపురం, వెంకటేశ్వరపురం ప్రాంత మహిళలు మంగళవారం గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేశారు. 10 రోజులుగా తాగునీరు రావడంలేదని పలుసార్లు సిబ్బందికి తెలియజేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఉదయం 11.10 అయినా సిబ్బంది కార్యాలయానికి రాకపోవడంతో, తమ సమస్యలు ఎవ రికి చెప్పుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయానికి వస్తున్న గ్రామ పంచాయతీ సెక్రటరీని మహిళలు చుట్టుముట్టారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామని, మోటారు రిపేరు కారణంగా నీటి సమస్య ఏర్పడిందని తెలిపారు.


గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

ఎర్రమట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయండి

సిద్దవటం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తమ పొలాల్లోని ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ చెన్నంశెట్టి శశికుమార్ అనే వ్యక్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప - చెన్నై జాతీయ రహదారి లోని కనుమలోపల్లె సమీ పంలో 38, 39, 40 తదితర సర్వే నెంబర్లలో తమ కుటుంబ సభ్యులకు చెందిన పట్టా భూములున్నాయని, ఆ భూముల్లోని మట్టిని కొందరు అక్రమంగా ఎక్స్‌క వేటర్లతో తవ్వి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భూముల్లో మట్టి తవ్వుతున్న విషయం కొంతమంది తనకు ఫోన్ చేసి చెప్పడంతో అక్కడికి వెళ్లి పరిశీలించానని, మట్టి తవ్వుతున్న ఒక ఎక్స్‌కవేటర్‌ను పట్టుకుని పోలీ సులకు అప్పజెప్పానని తెలిపారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న చెన్నంశెట్టి శశికుమార్

వంట ఏజెన్సీ మార్పు

సిద్దవటం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పోలీసు బెటాలియన్ పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పుత్తా విజయకుమారి అనే మహిళను వంట ఏజెన్సీగా ఎన్నుకున్నారు. పాత ఏజెన్సీకి సంబంధించిన ఎం.విజయకుమారి వంట గది తాళాలు ఇవ్వకపోవడంతో స్కూలు ఆవరణలోనే నూతన ఏజెన్సీవారు భోజనం సమకూర్చారు. ప్రధానోపాధ్యాయులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ వంట గది తాళాలు ఇవ్వలేదంటూ స్థానిక గ్రామ సచివాలయంలో మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సిమెంటు రోడ్డు ఏర్పాటు

పుల్లంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పయ్యరాజు పేట పంచాయతీ రామక్కపల్లెకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులు ఇబ్బంది పడేవారు. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద సిమెంటు రోడ్డు నిర్మాణానికి 10 లక్షలు నిధులు మంజూరు చేయ డంతో వెంటనే పనులు చేపట్టి రోడ్డును పూర్తి చేశారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రామక్కపల్లెకు వెళ్లే మార్గంలో వేసిన సిమెంటు రోడ్డు

సమాజ శ్రేయస్సే 'గుడ్ నైబర్స్' లక్ష్యం


బోరును ప్రారంభిస్తున్న గుడ్ నైబర్స్ ఇండియా ప్రతినిధులు

సుండుపల్లె,జనవరి7 (ఆంధ్రజ్యో తి): సమాజ శ్రేయస్సే లక్ష్యం గా గుడ్‌నైబర్స్ ఇం డియా కృషి చేస్తోందని జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారిణి రమాదేవి అన్నారు. మండల కేంద్రానికి సమీపంలోని దిగువ హరిజనవాడలో ఆ సంస్థ ఆధ్వర్యంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌తో పాటు, బోరును మంగళవారం సంస్థ కంట్రీ డైరెక్టర్ సందీప్‌గుప్త, డోనర్ మిస్టర్ యాన్, ప్రోగ్రాం మేనేజర్ మిస్ సుస్మిత, ప్రోగ్రాం ఆఫీసర్ రామ్‌నరేశ్, ఏపీ కోర్ మేనేజర్ హర్షన్, ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికిప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, గుడ్ నైబర్స్ ఇండియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పదో తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ

సంబేపల్లె, జనవరి7(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రూపొందించిన పదవ తరగతి అధ్యయన సామగ్రిని సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే పదవతరగతి విద్యార్థులకు సంఘ నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు అంకం శివారెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తక రచయిత మడితాటి నరసింహారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మురళీకుమార్, మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సంఘ నాయకులు నాగేశ్వర, రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నందలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖాధికారులు ఎల్.నాగయ్య, సీఆర్ అనంతకృష్ణ, ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసులు, అసిస్టెంట్ హెడ్మాస్టర్ షేక్ రౌఫ్‌బాషా కోరారు. మంగళవారం నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్, మాదిరి ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇచ్చి వంద శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని సూచించారు.

'క్రీడల్లో గెలుపోటములు సహజం'


బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పెనగలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెనగలూరు ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం జనసేన మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రంశెట్టి హరిబాబురాయల్, గుబ్బూరు హరికృష్ణరాయల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, రాజుకుంట గ్రామ సర్పంచ్ గుత్తి నరసింహ అబ్బిగారి గోపాల్, లింగం నరేష్, ఆర్గనైజర్లు రాజేష్, శివ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల ఆక్రమణలపై చర్యలు

గాలివీడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు సంబంధించిన భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని జిల్లా దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని ఎగువగొట్టివీడు పంచాయతీలో తహసీల్దార్ భాగ్యలత ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమ శాఖ ఉద్యోగులు, ఇన్‌స్పెక్టర్లు సదస్సులకు హాజరై దేవాదాయ భూములను గుర్తిస్తారన్నారు. సర్వే చేసి భూములను దురాక్రమణ నుంచి కాపాడడం దేవాదాయశాఖ చట్టం మేరకు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వారు కౌలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మురళి, వీఆర్‌వో విమల్‌కుమార్, విలేజ్ సర్వేయర్ వినోద్‌కుమార్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, టీడీపీ నాయకులు శివప్పనాయుడు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న రూపానందరెడ్డి

రైల్వేకోడూరు(రూరల్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వంలో ఆ సమస్యలను పరిష్కరించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మహబూబ్ చాంద్, అనంతరాజుపేట టీడీపీ నాయకులు సుకుమార్ రెడ్డి, మండల నాయకులు కొమ్మ శివ, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అనాలోచిత నిర్ణయాలతోనే భూ సమస్యలు



సమావేశంలో ప్రసంగిస్తున్న సాయిలోకేష్

పుల్లంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల అనాలోచిత నిర్ణయాలే భూ సమస్యలకు కారణమని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. మంగళవారం పుల్లంపేట మండలం ఎస్‌ఆర్‌పాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రైవేటు భూములు కూడా అన్యాక్రాంతం చేసిందన్నారు. ఆక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఎవరి భూములు వారికి దక్కడానికి పక్కాగా రికార్డులు తయారు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నెలరోజులుగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోం దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవిందకిషోర్, ఆర్ఐ సుశీల్, సర్వేయర్ శ్రీరాములు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం

సుండుపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డరాచపల్లెలో నిర్మిస్తున్న వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీజీకే రామచంద్రరాజు మంగళవారం రూ.1,00,116 విరాళం అందజేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా దాతను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు రెడ్డెయ్యరాజు, గంగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

రాయచోటి కలెక్టరేట్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నర సింహులు, రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ 2008లో ఏర్పడిన ఇందిరమ్మ కాలనీ ఇప్పటికీ కనీస వసతులకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు తాగునీటి సౌకర్యం కల్పించామని గత పాలకులు చేసిన ప్రచారం ఆచరణకు నోచుకోలేదన్నారు. అప్పటికే 500 కుటుంబాలు నివసిస్తున్న కాలనీలో దాదాపు 150 మంది చిన్నపిల్లలు ఉన్నా కనీసం అంగన్వాడీ కేంద్రం గానీ, ఆరోగ్య ఉపకేంద్రం గానీ లేవన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, వెలిగల్లు ప్రాజెక్టు పైపులైను ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించాలని చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి టీవీ సుదర్శన్, సీపీఐ ఓబులేసు, అంజి, మహిళలు రమాదేవి, లక్ష్మి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తెలుగు భాషపై దృష్టి సారించాలి

రాజంపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తెలుగు భాషలో పరిజ్ఞానం సాధించాలని రాజంపేట స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ తెలిపారు. పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సమైక్యత, వ్యక్తిత్వ వికాసం అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశంలో దేశ పౌరులందరికి సమాన హక్కులు ఉన్నాయన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమణారెడ్డి, ప్రిన్సి పాల్ ఈశ్వరయ్యనాయుడు, రామాంజనేయులు, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలి



ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వేకోడూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలపై అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు అంగన్వాడీ కార్య కర్తలను వేధిస్తున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. పుల్లంపేట మండలం కోనయ్యగారిపల్లె, రైల్వేకోడూరు పంచాయతీలోని వేంకటేశ్వరపురం అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలను దుర్భాష లాడడం, ఉమ్మివేయడం, మెమోలు ఇవ్వడం వంటి చర్యలతో వేధిస్తున్నారని తెలిపారు. దీంతో ఆయా కార్యకర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారని తెలిసి ఓదార్చి, ధైర్యం చెప్పినట్లు వివరించారు. ఓబనపల్లె అంగన్వాడీ కేంద్రంలో తలుపులు దెబ్బతిన్నాయని చెప్పినా వినిపించుకోకుండా మీరే తెచ్చుకుని వేసుకో వాలని ఉచిత సలహా ఇచ్చారని తెలిపారు. బియ్యం, కందిపప్పు, నూనె తదితరాలు ఇవ్వకపోయినా కార్యకర్తలు ఇళ్ల నుంచి తెచ్చి పిల్లలకు వండిపెడుతున్నారని తెలి పారు. రైల్వేకోడూరు అధికారులు తిరుపతిలో నివాసం ఉంటూ ఎప్పుడో వచ్చి పోతుంటారని తెలిపారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు ఆరా తీసి అంగన్వాడీ కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్. శ్రీలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎన్. రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రాధాకుమారి, కోశాధికారి జి. పద్మ, సీఐటీయూ మండల కార్యదర్శి పి. జాన్‌ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు ఉషారాణి, గంగాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

సుండుపల్లె, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రం వద్ద ఆశావర్కర్లతో కలిసి ఆందోళన చేశారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. నిత్యం ప్రజలకు సేవ చేసే ఆశ కార్యకర్తల డిమాండ్లను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాండవుల బావులు



గుండంలోని నీరు

- భీముడి గదాఘాతంతో ఏర్పడ్డ నీటి గుండాలు
- నేటికీ గ్రామ నీటి అవసరాలు తీర్చుతున్న గుండాలు
- భీముడి పేరుతో భీమగుండం గ్రామం

పెద్దముడియం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాల క్రితం వరకూ గ్రామాల్లోని జనం నీటి అవసరాలను దిగుడు, చేదుడుబావులు తీర్చేవి. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బావులు కాస్త కనుమరుగయ్యాయి. తరువాత 200 నుంచి 500 అడుగుల లోతులో ఉన్న పాతాళగంగను చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు ద్వారా నీటిని తోడుకుని జనం నీటి కష్టాలు తీర్చుకునేవారు. ప్రస్తుతం ఉపరితల నీటి ట్యాంకులు వచ్చి పైపులైన్ల ద్వారా ఇళ్ల వద్దకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం భూగర్భజలాలు వందల అడుగుల లోతుల్లోకి పడిపోయాయి. బావులు, బోర్లు, చేతిపంపులు కనుమరుగయ్యాయి. అయితే పెద్దముడియం మండలంలోని ఆ గ్రామంలో మాత్రం కొండ ప్రాంతంలో నేటికీ ఐదు నుంచి పది అడుగుల లోతులో జలకళతో నీటి గుండాలు కొన్ని దర్శనమిస్తున్నాయి. చేతిబోర్లు, విద్యుత్ మోటార్లు, నీటి ట్యాంకులు వంటి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినా నేటి వరకు ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి. ఎప్పుడో శతాబ్దాల క్రితం ఈ నీటిగుండాలు ఏర్పడ్డాయి. మా పూర్వీకులు చెప్పేవారంటూ గ్రామస్థులు అంటున్నారు. పెద్దముడియం మండలంలోని కొండ ప్రాంతంలో గల భీమగుండం గ్రామానికి ఓ చరిత్ర ఉందని పూర్వీకులైన మా పెద్దలు చెప్పేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. భీమగుండం గ్రామం కొండ ప్రాంతం. ఈ ప్రాంతంలో పూర్వం దట్టమైన అటవీ ప్రాంతం ఉండేదని, మహాభారత కాలంలో పాండవులు వారి వనవాస సమయంలో ఈ ప్రాంతంలో సంచరించారని, ఆ సమయంలో పాండవులకు నీటి సమస్య వచ్చింది. ఎక్కడా నీటి జాడ కనిపించలేదు. దీంతో ధర్మరాజు ఆదేశానుసారం భీముడు తన గదాఘాతంతో కొండ ప్రాంతంపై గట్టిగా కొట్టడంతో ఆ దెబ్బకు నీటి గుండాలు ఏర్పడ్డాయి. ఆ నీటి గుండాల్లోని నీటితో వారి అవసరాలు తీర్చుకుని వెళ్లిపోయారు. తరువాత కాలంలో ఆ నీటి గుండాల్లోని నీటిని ఆసరాగా చేసుకుని కొందరు జనాలు జీవనం సాగించేవారని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇలా ఏర్పడ్డ జన సమూహంతో అది గ్రామంగా మారింది. ఇలా భీముడి గదాఘాతానికి ఏర్పడ్డ గుండాల ద్వారా ఏర్పడిన గ్రామానికి భీమగుండంగా నామకరణం అయిందని గ్రామస్థులు తెలుపుతున్నారు. విచిత్రమేమంటే దశాబ్దాల కాలంలోనే భూగర్భజలాలు అడుగంటి బావులు బోర్లు ఎండిపోతున్న ఈ తరుణంలో భీమగుండంలోని నీటి గుండాలు అత్యంత తక్కువ లోతులోనే జలకళతో కనిపిస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా గ్రామస్థులు ఈ గుండాల్లోనే నీటిని ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తినప్పుడు వ్యవసాయ అవసరాల కోసం గుండాల్లో నీటిని ప్రజలు ఉపయోగిస్తున్నారు. ఈ గుండాల చుట్టూ రక్షణగా ప్రహరీలు నిర్మించారు. అయితే కొన్ని గుండాలకు ప్రహరీ లేకపోవడంతో చెత్త చెదారంతో నిండాయి. ఈ గుండాల్లో నీటిని తోడుకునేందుకు అనువుగా అప్పట్లో తాపలు కూడా ఏర్పాటు చేశారు. భీముడి పేరుతో ఏర్పడ్డ నీటి గుండాలు నేటికీ ఆ గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చుతున్నాయి.

ఫిల్టరు నీళ్ల కంటే రుచిగా ఉంటాయి



పాండవుల కాలంలో ఈ నీటి గుండాలు ఏర్పడ్డాయని మా పెద్దలు చెబుతుంటారు. ఈ గుండాల్లో నీరు ఎంతో స్వచ్ఛంగా ఫిల్టర్ల నీటి కంటే రుచిగా ఉంటాయి. ఇప్పటికీ ఈ నీటిని ఉపయోగిస్తున్నాం. గ్రామంలో నీళ్ల సమస్య వస్తే అందరం నీటి గుండాలను ఆశ్రయించాల్సిందే. భీముడి గదతో కొట్టగా ఏర్పడ్డ గుండాల కారణంగా భీమగుండం గ్రామం పేరు వచ్చిందని మా పెద్దలు చెప్పేవారు.

-వెంకటేశ్వర్లు, భీమగుండం

వంతులవారీగా నీళ్లు తీసుకెళ్లేవారం



గ్రామంలో కుళాయిలు ఏర్పాటు కాక ముందు అందరం ఈ గుండాల నీటి వద్దకు వెళ్లి క్యూలైనులో నిలబడి వంతుల వారీగా కడవలు, బిందెలతో నీళ్లు ముంచుకుని తీసుకువచ్చేవారం. నీళ్లు చాలా స్వచ్ఛంగా ఉండేవి. ప్రస్తుతం కుళాయిలు, ఫిల్టరు నీళ్లు వచ్చాక గుండాల్లో నీటి వాడకం తగ్గింది. అయితే కుళాయి నీరు రాకపోతే ఈ గుండాల వద్దకే వెళ్లి నీరు తెచ్చుకుంటాం. వర్షాకాలంలో నీటి గుండాల్లో నీరు పొంగి వీధుల్లో పారుతాయి.

- సరస్వతి, భీమగుండం



గుండంలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తాపలు



గదతో కొట్టినట్లుగా కనిపిస్తున్న గుండం



గ్రామంలో ఉన్న అతి పెద్ద నీటి గుండం



నీటి గుండం చుట్టూ రక్షణ గోడ

'అన్నమాచార్య'లో వైభవంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి
- 9న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రాక





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్పా గంగిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యార్థినుల నృత్య ప్రదర్శన

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ విద్యాలయాలను ప్రారంభించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను మంగళవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్, విద్యాసంస్థల అధినేత, అన్నమాచార్య యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట లాంటి చిన్న పట్టణంలో అన్నమాచార్య విద్యాలయాలను 25 ఏళ్ల కిందట ప్రారంభించి నేడు యూనివర్సిటీ స్థాయికి తీసుకురావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఉత్తమ శిక్షణ, ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా ఈ విద్యాలయాలను ప్రారంభించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రఖ్యాత సంగీత కళాకారుడు రామ్ మిరియాల మ్యూజిక్ విద్యార్థులను ఎంతో అలరించింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ మల్లికార్జునరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ జయరామిరెడ్డి, డీన్ సుబ్బారావు, సుమారు 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ రాక

అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈనెల 9వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరవుతున్నట్లు యూనివర్శిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. అదేరోజు ఉత్సవాలకు ప్రముఖ హాస్యనటుడు కె.బ్రహ్మానందం హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌చౌదరి, తెలుగు సినిమా హీరో కిరణ్ అబ్బవరం హాజరవుతున్నట్లు తెలిపారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ బుధవారం సాయంత్రం జరిగే కార్యక్రమాలకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సతీష్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు వేలాదిమంది విద్యార్థులచే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రాజంపేట పట్టణంలో భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీకి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

మౌలిక వసతులకు పక్కాగా సర్వే చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులు, వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం మంతన్ శివిర్‌లో భాగంగా జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ధర్తీ అభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద జిల్లా మంతన్ శివిర్ సమావేశం నిర్వహించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. 25 అంశాల్లో గిరిజనులు, వారి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని 17 శాఖలకు నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రతిశాఖ రాబోయే ఐదు సంవత్సరాల్లో షెడ్యూల్ తెగల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్టీలకు కేటాయించిన నిధుల ద్వారా నిర్దిష్ట కాల పరిమితిలో పథకాల అమలును పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు జిల్లాలో 50 శాతానికి పైబడి గిరిజనుల జనాభా ఉన్న పెనగలూరు, కోడూరు, లక్కిరెడ్డిపల్లె, కురబలకోట 4 మండలాల్లో 17 గ్రామాలు పథకాల సంతృప్త అమలుకు ఎంపిక చేయబడినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలో గల 17 గ్రామాల్లోని సచివాలయాల్లో ఆయా పంచాయతీల వారీగా ఎస్టీ గృహాలు, వారి జనాభాను గుర్తించి రెండు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారిణి తేజస్విని, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యం, డీఆర్‌డీఏ, డ్వామా, పంచాయతీ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగోత్సవ్ పోటీలు విజయవంతం



ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల విజేతలతో అధ్యాపకులు

రాయచోటిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమ కో-ఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ పోటీలు ఒక అద్భుతమైన వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో హసీషా, డ్రాయింగ్‌లో ఎస్ఎండీ తౌసిఫ్, చేతిరాత పోటీలో భవ్యశ్రీ, రంగోళి పోటీల్లో ఐశ్వర్య జానపద నృత్యంలో నాగనిషిత బృందం, డిజిటల్ కోల్లాజ్‌లో హర్షిత, స్లోగన్ రైటింగ్‌లో ప్రవల్లిక, రోల్‌ప్లే పోటీలో చైతన్య విజేతలుగా నిలిచారు. ఈ పోటీలను మొత్తం 8 విభాగాల్లో నిర్వహించారు. ఒక్కో విభాగంలో మొదటి స్థానాన్ని పొందిన వారు జనవరి 24న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలకు డైట్ కళాశాల అధ్యాపకులు శివభాస్కర్, శ్రీదేవి, అసదుల్లా, నాగరాజు, నాగేశ్వరరావు, ప్రకాశ్‌రెడ్డిలు జడ్జిలుగా వ్యవహరించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర పోషించిన కో-ఆర్డినేటర్లు, నిర్వాహకులకు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రైల్వేకోడూరు క్రీడాకారులకు బ్యాడ్మింటన్‌లో మొదటి ర్యాంకు



రైల్వేకోడూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ షటిల్ బాడ్మింటన్ (జూనియర్ విభాగం) పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థులు గొబ్బూరు విశ్వతేజ్, అరిగెల భార్గవ్‌రాం మొదటి ర్యాంకు సాధించారు. మహారాష్ట్రలోని పూణెలో షటిల్ బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది అక్టోబరులో అంతర్జాతీయ స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈనెల 5న ఈ ఏడాదికి మొదటి ర్యాంకును బీడబ్ల్యూఎఫ్ (బాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్) ప్రకటించినట్లు విద్యార్థులు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో రెండు సార్లు మొదటి స్థానంలో నిలవడంతో ఈ ర్యాంకు లభించిందని వారు తెలిపారు.

బంగారు షాపు యజమానికి బురిడీ

- నకిలీ బంగారం ఇచ్చి... 22 గ్రాముల బంగారు నగలు పట్టుకెళ్లారు...
- సీసీ టీవీలో ఇద్దరు మహిళల గుర్తింపు



నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన మహిళలు

రాజంపేట టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బంగారంతో ఇద్దరు మహిళలు నగల వ్యాపారినే బురిడీ కొట్టించిన ఉదంతం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజంపేట పట్టణంలోని పాత పోలీసు లైనులో మహీద్‌ఖాన్ అనే వ్యక్తి బంగారు నగల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఆదివారం సాయంత్రం ఆయన దుకాణానికి వచ్చిన ఇద్దరు మహిళలు తమ వద్ద ఉన్న పాత నగలు ఇచ్చి వాటికి బదులుగా కొత్త నగలు కొనుగోలు చేశారు. వారు తెచ్చిన నగలపై హాల్‌మార్కు ఉండడంతో షాపు యజమాని జాగ్రత్తగా పరీక్షించకుండానే తీసుకున్నారు. సోమవారం ఆ నగలను కరిగించగా అది బంగారం కాదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన షాపు యజమాని సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కిలాడీ లేడీలు అపహరించిన బంగారు విలువ సుమారు 1.70 లక్షలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడి...



తులసమ్మ (ఫైల్)

రామసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం గోవింద మాల వేసి కాలినడకన తిరుమలకు వెళ్తున్న భక్తులను సోమవారం ఉదయం తిరుపతి సమీపంలో 108 వాహనం ఢీకొన్న ఘటనలో గాయపడిన తులసమ్మ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలు మండలంలోని మాలేనత్తం గ్రామ పంచాయతీ చింపరపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి భార్య. సోమవారం 108 వాహనం ఢీకొన్న ఘటనలో తులసమ్మకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రిలో చేర్చారు. ఇదే ఘటనలో సోమవారం ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విదితమే. కాగా మృతి చెందిన మహిళ దహనక్రియలు సోమవారం చింపరపల్లె, సింగంవారిపల్లెలో జరగ్గా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మృతి చెందిన ఒక్కొక్క మహిళ కుటుంబానికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా బీసీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ వివిధ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందించే వివిధ రకాల రుణాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, తదితర వివరాలను కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు రూ.34 కోట్లు బీసీ కార్పొరేషన్, ఈబీసీ, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించిందని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఎం ఆంజనేయులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన నరేశ్

మదనపల్లె అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు మృతి చెందిన సంఘటన బసినికొండలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం రామాచార్లపల్లెకు చెందిన పెయింటర్ నరేష్ (30) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అతను సంఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నరేష్ మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలోకి వెళ్లి పనిముగించుకుని తిరుగు ప్రయాణంలో రామాచార్లపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బసినికొండ శివాలయం వద్ద నిమ్మనపల్లె నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నరేష్ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి శవ పరీక్ష కోసం తరలించారు. ఈ మేరకు తాలుకా సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్ లేక...

- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- బయటి ఫుడ్ కోసం వెంపర్లాట
- రాజకీయ ఒత్తిడితో ముందుకు సాగని క్యాంటీన్‌ల ఏర్పాటు

వేంపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మూడు నెలలుగా విద్యార్థులు ఆహారం కోసం ఇబ్బంది పడుతున్నారు. క్యాంపస్‌లోని క్యాంటీన్లకు అలవాటుపడ్డ విద్యార్థులు అవి మూతపడడంతో బయట ఫుడ్ కోసం ఎగబడుతున్నారు. మెస్‌లలో ఆహారం అందిస్తున్నప్పటికీ మొదటి నుంచి క్యాంటీన్‌లోని ఆహారానికి అలవాటుపడ్డ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు నెలలల క్రితం మూసివేశారు. కొత్తగా తిరిగి ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అయితే మూడు నెలలు కావస్తున్నా క్యాంటీన్లు ఏర్పాటు కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక దశలో విద్యార్థులు ఆందోళన కూడా చేపట్టారు. సర్దిచెప్పిన అధికారులు బయటిఫుడ్ తెప్పించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. ఈ బయట ఫుడ్ ద్వారా విద్యార్థులకు ఏదైనా సమస్య ఉత్పన్నమవుతుందేమోనని తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంది. క్యాంపస్‌లో క్యాంటీన్లు లేకపోవడం వల్లే విద్యార్థులు బయటఫుడ్‌కు ఎగబడుతున్నారు. అధికారులు క్యాంటీన్లు ఏర్పాటు చేయకుండా జాప్యం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా...

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటులో రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. గత ప్రభుత్వంలో ఏర్పాటైన క్యాంటీన్లు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వంలోని రెండు వర్గాలు, వైసీపీ వారు క్యాంటీన్ల ఏర్పాటు విషయంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త, జిల్లా కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరికి ఎంత కేటాయించాలనే విషయంపై ట్రిపుల్‌ఐటీ అధికారులకు తలనొప్పి వ్యవహారంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికి వారు తమకే కావాలంటూ ఆరు పార్టీల నేతలు పట్టుబడుతున్నారు. దీంతో క్యాంటీన్ల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ట్రిపుల్‌ఐటీ అధికారులు ఏదొక నిర్ణయం తీసుకొని వెంటనే క్యాంటీన్లను ఏర్పాటు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

డైరెక్టర్ ఏమన్నారంటే..

క్యాంటీన్ల ఏర్పాటు జాప్యంపై డైరెక్టర్ కుమారస్వామి గుప్తను అడగ్గా.. త్వరలోనే క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని అందుకు తగ్గ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత కొద్ది వారాలుగా డైరెక్టర్ ఇదే విషయాన్ని చెబుతున్నారు. అయితే ఆచరణలో క్యాంటీన్లు ఏర్పాటు కావడం లేదు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి ఉంది.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- మహాధర్నాలో నినదించిన అంగన్వాడీలు



కడప కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో అంగన్వాడీలు, సంఘాల నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని అంగన్వాడీలు నినదించారు. మంగళవారం కడప కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మంజుల, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ సెక్రటరీ బాదుల్లాలు మాట్లాడుతూ పనిభారం పెంచుతూ, నిత్యం నిత్యావసర సరుకులు ధరలు, డీజల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, విధులలో చనిపోయిన వారికి రూ.5లక్షలు ఇవ్వాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గ్రాట్యుటీ వెంటనే అమలు చేయాలని, గౌరవ వేతనాలు బిల్లులు ప్రతినెల 5వ తేదీలోపు చెల్లించాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీ టీచర్లకు హెల్పర్లకు అందరికీ వర్తింపజేయాలన్నారు. కాగా, కడప నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టి మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నాయకులు విజయ, సుజాతమ్మ, యశోద, శ్రీదేవి, ప్రసన్న, పార్వతి, రజని, శివనారాయణమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేట్ సైబర్ టెక్ సొల్యూషన్స్‌తో వైవీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో వీసీ కృష్ణారెడ్డి, సీఈఓ తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్నోవేట్ సైబర్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో (హైదరాబాద్) పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ సీఈఓ మోనిక, ఎండీ అభిమాన్యురావు, ప్రోగ్రాం డెవలపర్ మందూరు అయ్యప్ప, యోగివేమన యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వివిధ ప్రముఖ సంస్థలకు, పరిశ్రమలకు మానవ వనరులను అందించే సైబర్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ విద్యార్థులను నైపుణ్యత గల వారీగా తయారు చేస్తారని తెలిపారు. అలానే ఉద్యోగ అవకాశాలకు ప్రమోట్ చేస్తారని వివరించారు. సీఈఓ మోనిక మాట్లాడుతూ రెండేళ్ల పాటు ప్లేస్‌మెంట్ శిక్షణలు, ఇంటర్న్‌షిప్‌లు ప్లేస్‌మెంట్‌లను అందించడంలో సహాయపడుతామన్నారు. ఇఫిషియల్ ఇంటలిజెంట్, సెయిల్ పాయింట్, సైబర్‌ఆర్క్, ఒరాకిల్, హెచ్‌సీఎం, శాప్ ఏఐ, శాప్ ఎండీజీ, మెషిన్ లర్నింగ్, డేటా సైన్స్, పైథాన్ జాంగో, శాప్ ఇంటోన్, ఫుల్‌స్టాక్ పైతాన్, వెబ్ డెవలెంట్, బ్లాక్ చైన్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూట్ మొదలైన కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. సమావేశంలో ప్రజా సంబంధాల విభాగం సచాలకులు డాక్టర్ పి.సరిత పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తాం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి



విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, రైతులు

చెన్నూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతు తాను సాగు చేసే పంటలో అధిక దిగుబడులు సాధించి లాభపడేందుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరపు సుబ్బారెడ్డి అన్నారు. కడప నగరానికి వచ్చిన ఆయనను మంగళవారం చెన్నూరుకు చెందిన పలువురు రైతులు, టీడీపీ నేతలు కలిసి రైతుల శ్రేయస్సు కోసం నాణ్యమైన విత్తనాలు అందించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ప్రతి రైతు బాగుపడాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సీఎం చంద్రబాబు ప్రతి రైతు కోసం ఎంతో తపిస్తున్నాడని.. రైతు బాగున్నప్పుడు రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశ్యంతో ఇప్పటి నుంచే విత్తనాభివృద్ధి సంస్థను ముందుకు తీసుకెళ్లి అన్ని గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. గత ప్రభుత్వంలో విత్తనాభివృద్ధి సంస్థ పరంగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా రైతు సాగులో ఖర్చులు తగ్గించుకునేందుకు రైతు భరోసా రూ.20వేలకు పెంచి ఇవ్వబోతున్నట్లు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఐ.శివారెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, రైతు నేతలు వెంకటసుబ్బయ్య, కుంచెం రామక్రిష్ణారెడ్డి, ముండ్లపల్లె శ్రీనివాసులరెడ్డి, హనుమంతురెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, సంజీవరాయుడు, శివయ్య, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉమూమి తబ్లిగీ ఇజితెమా

- భారీగా తరలివచ్చిన ముస్లింలు



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న ఉలేమాలు

ఆత్మకూరు, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మ కూరు కేంద్రంగా మూడు రోజుల పాటు జరగనున్న ఉమూమి తబ్లిగీ ఇజితెమా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీశై లం రస్తాలోని సుమారు వంద ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇజితెమా ప్రాంగణానికి కర్నూ లు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలివచ్చారు. మధ్యాహ్నం ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు ఆధ్మాత్మిక ప్రవచనాలను, మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను వినిపించారు. తొలిరోజు మధ్యాహ్నం, సాయం త్రం, రాత్రి వేళల్లో ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. ఇదిలావుంటే వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికోసం ఇజ్‌తెమా నిర్వహణ కమిటీ భారీ ఏర్పాట్లను సిద్ధం చేసింది. వంద ఎకరాల్లో ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నమాజులు చేసుకునేందుకు వీలుగా సదుపాయాలను కల్పించారు. అలాగే విద్యుద్దీకరణతో పాటు భారీ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. అదే క్రమంలో సుమారు 5వేల మరుగుదొడ్లు, స్నానపుగదులు, 17భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా రూట్లలో 18చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పా టు చేసి ట్రాఫిక్‌జామ్ సమస్య వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో బస్టాండ్‌కు చేరుకున్న వారికి ప్రత్యేక వాహనాల్లో ఇజితెమా ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు కల్పించారు. కాగా మంగళవారం రాత్రికి ఇజితెమా ప్రాంతానికి అధిక సంఖ్యలో ముస్లింలు తరలి వచ్చారు. బుధవారం ఉదయం నుంచి భారీ స్థాయిలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వహణ కమిటీ సభ్యులు వెల్లడించారు.

వరుస విజయాలతో.. సత్తా చాటిన కడప జట్టు

- మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయకేతనం

కడప స్పోర్ట్స్ జనవరి 7, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్- 12 బాలుర అంతర్ జిల్లాల సౌత్‌జోన్ క్రికెట్ పోటీలలో కడప జట్టు వరుసగా రెండో విజయం సాధించి సత్తా చాటింది. అలాగే నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో గెలు పొందింది. వివరాలిలా.. నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం మైదానంలో కడప- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేపట్టింది. నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ఇందులో భువన్ సాయి 54 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు కేవలం 25.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో తాహీర్ 35, యోగాంజనేయులు 32, విష్ణువర్ధన్‌రెడ్డి 31 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 7 వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని ఖాతాలో వేసుకుంది.



ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తలపడుతున్న నెల్లూరు- కర్నూలు జట్లు



భువన్‌సాయి (54 పరుగులు), జాన్‌సన్ (53 పరుగులు)

కర్నూలుపై నెల్లూరు జట్టు గెలుపు

రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయానికి అవసరమైన 141 పరుగులు చేసింది. ఇందులో జాన్ సన్ 53 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురువేసింది.

పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలి

కడప మారుతీనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గోదావరి, పెన్నా నదులను అనుసాంధానం చేయాలని సంకల్పించడం హాస్యాస్పదంగా వుందన్నారు. వెనుకబడిన ప్రాంతం రాయలసీమలో పెండింగ్‌లో వున్న హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నదుల అనుసంధానం ప్రక్రియ చేపట్టాలని భావించడం అవివేకమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, నదుల అనుసంధానం అనే అంశంపై మంగళవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొదట పెండింగ్‌లో వున్న 55 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి 33 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. గోదావరి-కృష్ణ-పెన్నా నదుల అనుసంధానం పేరుతో 80వేల కోట్లతో ప్రభుత్వం పథకం రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కొరకు నిధుల సాయానికి పంపుతున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా 385 టీఎంసీల నీటిని కృష్ణకు మళ్లించి రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతున్న తీరు విడ్డూరంగా వుందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, సత్తార్, గుర్రప్ప, అంజి, శంకర్, సుబ్బరాయుడు, దేవర శ్రీకృష్ణ, జయవర్ధన్, రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

పకడ్బందీగా పోలీసు నియామక పరీక్షలు

కడప క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలీసునియామక ప్రక్రియలో భాగంగా కడప ఉమ్మడి జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను 7వ రోజు మంగళవారం ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుకానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లకు ఉమ్మడి కడప జిల్లాలో 4,492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. 7వ రోజు మంగళవారం 600 మంది అభ్యర్థులకు 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. ప్రతిరోజూ అభ్యర్థులకు మొదటగా సర్టిఫికెట్స్ పరిశీలన, ఎత్తు, ఛాతివంటి ఫిజికల్ మెజర్‌మెంట్స్ చేస్తారు. తరువాత బయోమెట్రిక్ తీసుకుంటారు. దేహదారుఢ్యపరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ, అదనపు ఎస్పీ, పరిగెడుతున్న అభ్యర్థులు

ఇంత నిర్లక్ష్యమా..

- పూడిక తీశారు.. పై కప్పు మరిచారు
- కాలువలో పడిపోయిన మహిళ
- బద్వేలు మున్సిపాలిటీ తీరుపై స్థానికుల ఆగ్రహం

బద్వేలు టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ సంఘటన నిలుస్తోంది పట్టణపరిధిలోని స్థానిక నెల్లూరు రోడ్డు ప్రధాన రహదారిలో గల ఓ కేఫ్ ముందు భాగంలోని కాలువలో మున్సిపల్ సిబ్బంది పూడికతీత పనులు చేశారు. తిరిగి కాలువలకు పైకప్పు వేయకపోవడంతో ఓ మహిళ ఆ కాలువలో పడి గాయ పడింది. ఈ దృశ్యాలు అక్కడి సీసీ పుటేజ్‌లో రికార్డు కావడం.. ఇది సోషియల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారుల, సిబ్బంది తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే హెచ్‌పీ పెట్రోలు బంకు వద్ద కాలువలో పూడికతీసి వదిలేయడంతో వాహనాలు కాలువలో ఇరుక్కుపోతు న్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో పూడికతీసిన మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ కొరవడ టంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్

- ఏపీఎన్‌జీసీ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ప్రథమ శత్రువు ప్లాస్టిక్ అని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ క్రాఫ్ట్ ఇన్‌చార్జి డైరెక్టర్ పి.స్రవంతి (ఐఏఎస్) తెలిపారు. మంగళవారం కడప నగరం బాలవికాస్, నాగార్జున మోడల్ స్కూల్ పాఠశాలల్లో విద్యార్థులతో ఇంటరాక్షన్ అయ్యారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణం గొప్పతనాన్ని, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో ఒక మొక్కను దత్తకు తీసుకోవడం వల్ల ఆ మొక్క మానుగా మారి పర్యావరణానికి నాంది పలుకుతుందన్నారు. అనంతర నాగార్జున మోడల్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులతో ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ క్రాఫ్స్) విశిష్టతను వివరించారు. ఏపీఎన్జీసీ పీఓ సత్యనారాయణ, కడప మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

'డబ్బుకోసం మనవడే హతమార్చాడు'

మైదుకూరు రూరల్, జనవ రి 7 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన అల్లాడుపల్లె వీరారెడ్డి (75) గత నెల ఆరవ తేదీ మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే జనవరి 2వ తేదీ వీరారెడ్డి రెండవ భార్య కుమారుడు కుమ్మరి రమేష్ మా నాన్నది సహజ మరణం కాదని విచారణ చేపట్టాలని మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 4వ తేదీ ఉన్నతాధికారుల సమక్షంలో మృతుడు వీరారెడ్డి శవానికి పోస్టుమార్టం నిర్వహించారు. విచారణలో భాగంగా శెట్టివారిపల్లెలోని ఓ సీసీ కెమెరాలో రికార్డు అయిన ఫుటేజ్ ప్రకారం వీరారెడ్డి మనవడైన అల్లాడుపల్లె హరినాథ్‌రెడ్డి, అతని స్నేహితుడు కాలువపల్లి నరసిహులు ఇద్దరు కలిసి డబ్బుల కోసమే వీరారెడ్డిని చంపినట్లు విచారణ తేలిందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

జీతాలు పెరుగుతాయని మోసగింపు

ముద్దనూరు జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కంపెనీ అభివృద్ధి చెందితే.. జీతాలు పెరుగుతాయంటూ కంపెనీ యాజమాన్యం మోసగించి డబ్బులు వసూలు చేసిందని మంగళవారం మంగపట్నం గ్రామానికి చెందిన రాళ్లపల్లి మంజునాథ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు వివరాలు.. మంగపట్నం గ్రామానికి చెందిన మంజునాథ బెంగళూరులోని ఈడీ వేదా ఎడ్యుకేషన్ కంపెనీలో అకౌంట్ సెక్షన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ కంపెనీకి చెందిన యాజమాన్యం సాయిచరణ్ అతని భార్య రేష్మ కంపెనీ అభివృద్ధి చెందితే అందరికీ జీతాలు పెరుగుతాయని మోసగించారు. మంజునాథ వద్ద నుంచి రూ.10,62,620 తీసుకొని మోసం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు

తంబళ్లపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేవాలయాలకు చెందిన భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా దేవదాయశాఖ అధికారి సి.విశ్వనాథన్ హెచ్చరించారు. మంగళవారం జుంజురపెంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ...దేవాలయ భూముల ఆక్రమణదారులకు చట్ట ప్రకారం నోటీసులిచ్చి నిబంధనల మేరకు తొలగిస్తామన్నారు. కొన్ని చోట్ల దేవాలయ భూములకు కౌలు చెల్లించకుండా అనుభవిస్తున్నారని అటువంటి రైతులు వెంటనే కౌలు చెల్లించి మండల ఎండోమెంట్ అధికారుల నుంచి రసీదులు పొందాలని సూచించారు. కాగా, తంబళ్లపల్లె మండలంలో గత నెల 6వ తేదీ నుంచి 19 గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు మంగళవారంతో ముగిసాయి. ఈ సదస్సులో ప్రజలు, రైతుల నుంచి 7 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, డీటీ రవినాయక్, ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయ శాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె రెవెన్యూ సదస్సులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు



కలికిరి సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు మహేశ్వరీబాయి



ములకలచెరువులో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రదీప్

మాన్యం భూములను ఫ్రీహోల్డ్ చేయొద్దు

మదనపల్లె టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రికార్డుల పరంగా దేవుడి మాన్యంగా నమోదైన భూములను ఫ్రీహోల్డ్ చేయవద్దంటూ దేవదాయశాఖ అధికారి రమణ రెవెన్యూ అధికారులను కోరారు. మంగళవారం మండలంలోని చిప్పిలి గ్రామంలో రెవెన్యూ సదస్సులో రమణ మాట్లాడుతూ చిప్పిలి రెవెన్యూ గ్రామంలో యోగభోగేశ్వరాలయానికి విలువైన భూములకు దేవదాయశాఖ పేరిట పాసుపుస్తకాలు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించారు. వాటితో పాటు చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకు ముంపు భూములకు పరిహారం ఇవ్వాలని బాధితులు, రింగ్‌బండ్ నిర్మాణంతో వర్షపునీరు తమ గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ములకలచెరువు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ ప్రదీప్ పేర్కొన్నారు. మండలంలోని పాత ములకలచెరువు గ్రామ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

కురబలకోటలో: భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తహశీల్దార్ తపస్విని పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్లలో రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చిన వివిధ రకాల సమస్యలపై అర్జీలను తీసుకొన్నారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో గంగయ్య, ఆర్ఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రీసర్వే గ్రామాల్లో 1బీ రావడం లేదు

పెద్దమండ్యం, జనవరి 7(ఆంధ్రజ్యోతి)రీసర్వే గ్రామాలలో భూములకు సంబంధించిన 1బీ రావడంలేదు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్‌ను ఎంపీటీసీ రక్మాంగద రెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ కోరారు. మండలంలోని సిద్దవరం సచివాలయం వద్ద మంగళవారం రైతు సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ రైతు సదస్సులో వచ్చిన రైతు సమస్యలతో పాటు ప్రజలు అన్ని రకాల అర్జీలను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. అర్జీల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. దేవదాయశాఖ ఏఈవో విశ్వనాథ, ఆర్ఐ రమేష్, సర్వేయర్ హసీన్‌తాజ్, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రామచంద్ర,పాల్గొన్నారు.

రీ సర్వే తప్పులు చక్కదిద్దుతున్నాం

కలికిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో జరిగిన పొరపాట్లను చక్కదిద్దే పని మొదలు పెట్టామని తహసీల్దారు మహేశ్వరీబాయి చెప్పారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన కలికిరి గ్రామ రెవెన్యూ సదస్సులో తహసీల్దారు మాట్లాడుతూ రైతులు అందజేస్తున్న అన్ని రకాల దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలికిరి గ్రామంలోని దేవదాయ భూములను ఒకే ఆలయం పేరుతో రికార్డుల్లో నమోదు చేశారని వాటిని సవరించాలని ఆలయాల ఈవో మంజుల దరఖాస్తు చేశారు. లక్ష్మీనరసింహస్వామి, రాయదుర్గం లక్ష్మీనరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి, యల్లమ్మ దేవతల పేర్లతో ఆయా భూములను నమోదు చేయాలని ఆమె కోరారు. ఈ సదస్సులో నోడల్ అధికారి జయప్రకాష్, సర్పంచు ఎల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు వేంపల్లె అబ్దుల్ ఖాదర్, పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్వేయర్ రెడ్డెప్ప, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలను తొలగించండి

గుర్రంకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి):ఖండ్రిగ గ్రామంలో ఉన్న మురాద్‌బీకుంట ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు తహశీల్దార్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఖండ్రిగ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సులో మురాద్‌బీకుంట ఆక్రమణలకు గురైందని, కుంటకు నీరు వచ్చే వంకలను రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని మూసేశారని తెలిపారు. అలాగే కొందరు వంక స్థలాన్ని ఆక్రమించుకొని ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, వీఆర్వో పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలలో ముమ్మర ఏర్పాట్లు

వాల్మీకిపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశికి వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఆలయాలలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పట్టాభిరామాలయంలో ఈ నెల 11న ద్వాదశి సందర్భంగా వేకువ జామున 3గంటల నుంచి అభిషేకం, పూజల అనంతరం ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజులు పేర్కొన్నారు. అలాగే మండలంలోని చింతపర్తిలో కొలువైన 700ఏళ్ల నాటి పురాతన ఓబులేశ్వరస్వామి కొండపై వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకులు విద్యాసాగర్‌శర్మ తెలిపారు. అలాగే పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో, స్థానిక కోనేటివీధి లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, తదితర దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



ముస్తాబవుతున్న పట్టాభిరామాలయం

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టుల ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు మంగళవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొల్పి దూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయం చేరకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు మార్వారి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాలనాయుడు, కార్యదర్శి మార్వారి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగ స్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, దేవేంద్ర, మార్వారి విక్కీ, మార్వారి మహేష్, శ్రీనివాసులు నాయుడు, తదితరులు పర్యవేక్షించారు.



అలంకరణలో గంగమ్మతల్లి

దాడి ఘటనపై కేసునమోదు

పెద్దతిప్పసముద్రం జనవరి 7 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కందుకూరు గ్రామంలో ఇటీవల ఇద్దరు మైనార్టీ మహిళలపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కందుకూరుకు చెందిన తలారి రమీజాబి, ఆమె తల్లి రహీమాబీలపై మురుగునీటి విషయమైజరిగిన గొడవలో అదే గ్రామానికి చెందిన శివప్రసాద్ అతడి భార్య భవ్యలత దాడి చేశారని ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ వివరించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధుడు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మదనపల్లె తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. గత నెల 23న చౌడేపల్లె మండలం, కాటిపేరి గ్రామం, పెద్దగొర్లైకుంటకు చెందిన లక్ష్మన్న (63) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించారు. అక్కడ ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా శవపరీక్షల కోసం మదనపల్లె ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

జిల్లా ఆస్పత్రి నుంచి రెఫరల్ కేసులు తగ్గించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఆస్పత్రి నుంచి రెఫరల్ కేసులు తగ్గించాలని 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ నాగభూషణం ఆధ్వర్యంలో సిబ్బంది ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరమ్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఆస్పత్రికి నుంచి ప్రతి ఒక చిన్న రోగిని తిరుపతికి రెఫర్ చేయడంతో మండలంలో 108 వాహనం అత్యవసర పరిస్థితి ఉన్న రోగులకు అందుబాటులో లేకుండా పోతుందని వాపోయారు. ఇటీవల కురుస్తున్న పొగమంచు కారణంగా 108 వాహనాలు నడపడానికి రోడ్డు కనిపించక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. మూడు రోజుల క్రితమే చంద్రగిరి మండలం మంగాపురం వద్ద పొగమంచు కారణంగా రోడ్డు దాటుతున్న వేంకటేశ్వర మాలదారులు ఇద్దరు ప్రమాదంలో చనిపోవడం జరిగించదని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రెఫరల్ కేసులు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది యశ్వంత్, సూరిబాబు, బావజాన్, సునీల్, సాంబ, రఫీ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న 108 సిబ్బంది

టీడీపీ నేత మృతికి సంతాపం

మదనపల్లె/పెద్దతిప్పసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):పెద్దతిప్ప సముద్రం మండలం గొల్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు జగదం రమేష్(50) మృతి పట్ల తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడు కోపూరి మల్లికార్జుననాయుడు దిగ్ర్భాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం గొల్లపల్లెకు వెళ్లి రమేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గంలో సీనియర్ నేత మృతి పార్టీకి తీరనిలోటన్నారు. రమేష్‌కు ఛాతిలో నొప్పి రాగా, కుటుంబ సభ్యులు సోమవారం మదనపల్లెలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. గుండె ఆపరేషన్‌లో భాగంగా మూడు స్టంట్లు వేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేయగా అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీలు పేర్కొన్నారు. వైద్యుని నిర్లక్ష్యంతోనే తన తండ్రి మృత్యువాత పడ్డారని ఆయన కుమారుడు వాపోయారు. ముందుగానే బెంగళూరు వెళ్లమని చెప్పాల్సి వుందని, ఇక్కడ మూడు స్టంట్లు ఎందుకు వేశారని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు. దీనిపై న్యాయం చేయాలని, కూటమి నేతలను కోరాడు.



రమేష్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ సీనియర్ నేత మల్లికార్జునాయుడు

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

మదనపల్లె అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం ఇవ్వాలని తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్మైల్‌స్కూల్‌లో మద్దిరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కేక్‌కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలుతోపాటు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిప్పిలి సర్పంచ్ చిప్పిలి చలపతి సాయిశేఖర్, శివారెడ్డి, పునీల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న కనుగొండ మద్దిరెడ్డి

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి):మహిళపై దాడి చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మదనపల్లె మండలం, పెంచుపాడు గ్రామం, గుట్టవారిపల్లెకు చెందిన పాపులమ్మ(55)ను అదే గ్రామానికి చెందిన వెంకటేష్, సోముశేఖర్ దాడి చేసి గాయపర్చారు. పాపులమ్మ ఫిర్యాదు మేరకు తాలుకా ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుర్రంకొండలో 29 పెన్షన్‌లు తనిఖీ

గుర్రంకొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మండలంలో రెండవ రోజు తనిఖీ బృందం 29 మంది మంచానికి పరిమితమైన పింఛన్‌లను తనిఖీ చేశారు. పెన్షన్‌దారులను స్థితిగతులను పరిశీలించి వివరాలను సేకరించారు. ఎంపీడీవో వెంకటేశులు, డాక్టర్లు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై అవగాహన

వాల్మీకిపురం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలం గ్రామంలో రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు కేవీకే సమన్వయ కర్త డాక్టర్ మంజుల పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం చర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

హైందవ శంఖారావం విజయవంతం

మదనపల్లె టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలో ఈనెల 5వ తేది నిర్వహించిన హైందవ శంఖారావం 10 లక్షల మందితో విజయవంతం అయ్యిందని అఖండ నవభారత్ నిర్మాణ్ అధ్యక్షుడు నారదరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హిందూమతంలో కులభేదాలు లేకుండా అందరిని ఏకతాటిపై తీసుకొచ్చేందుకు నిర్వహించిన హైందవశంఖారావం ధర్మ పరిరక్షణకు తొలి అడుగు పడిందన్నారు. అఖండ భారతంలో తొలిసారిగా మన రాష్ట్రంలోనే హైందవ శంఖారావం నిర్వహించడం, యువత నుంచి వృద్దుల వరకు పెద్దసంఖ్యలో తరలివచ్చారన్నారు. ఈ బహిరంగ సభ హిందువుల ఐక్యతను చాటి చెప్పిందన్నారు. దేవాలయాల ఆస్థుల పరిరక్షణకు పీఠాధిపతులు, మేధావులు, వీహెచ్‌పీ నాయకులు హిందువులకు దిశానిర్దేశం చేశారన్నారు. రాష్ట్రంలో 10లక్షల ఎకరాల హిందూ ఆలయాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఆలయాల పవిత్రతను కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఖండ నవభారత్ నిర్మాణ్ అధ్యక్షుడు నారదరెడ్డి

హార్సిలీహిల్స్‌లో కేంద్ర కరువు బృందం

బి.కొత్తకోట, జనవరి7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించి, అంచనా వేసేందుకు నియమించిన కేంద్ర కరువు బృందం మంగళవారం రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు చేరుకుంది. కేంద్ర వ్యవసాయరైతు సంక్షేమశాఖ సంయుక్తకార్యదర్శి పేరిన్‌దేవి నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన అధికారుల బృందం రాత్రికి హిల్స్‌కు చేరుకొని గవర్నర్ బంగ్లాలో విశ్రాంతి తీసుకున్నారు. వారికి ప్రోటోకాల్ నిబంధనల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. విశ్రాంతి అనంతరం బుధవారం మండలంలోని తుమ్మణంగుట్ట పంచాయతీలో అధికారుల బృందం పర్యటించనుంది

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

కురబలకోట, జనవరి 7(ఆంధ్రజ్యోతి):మేనేజ్‌మెంట్ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఎగ్జిబిషన్ ఆన్ వ్యాల్యూ అనే అంశంపై ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా సామాజిక బాధ్యతలు పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా విద్యార్థులతో సృజనాత్మకత, నూతన ఆలోచన విధానాలు తదితర వాటిని వెలికి తీయవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీన్ శ్రీమంత బసు, వైస్ ప్రిన్సిపాల్ కమాల్‌బాష, రామనాథం, గీతాదేవిలు పాల్గొన్నారు.

అనారోగ్య పశువులకు వైద్యం అందించాలి

నిమ్మనపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్య పశువులకు సత్వరమే మెరుగైన వైద్యం అందిచాలని మదనపల్లి డివిజన్ పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అగ్రహారం, రాచవేటివారిపల్లి, ముష్టూరు, తవళం. అగ్రహారం, సామకోటవారిపల్లి, బండ్లపై గ్రామాలలో రైతుసేవా కేంద్రాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో పని చేస్తున్న పశుసంవర్థక శాఖ సిబ్బంది పాడి రైతులకు అందుబాటులో ఉండి అనారోగ్యం కలిగిన పశువులకు సత్వరమే వైద్యం అందిచాలని తెలిపారు. అనంతరం కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి ఉపాది హామీ పథకంలో ప్రతి రైతు 5నుంచి 10సెంట్ల భూమిలో వారి పాడి ఆవులకు కొరకు పశుగ్రాసాన్ని పెంచుకొంటే రెండేళ్లకు కలిపి ఉచితంగా రూ.32వేలను రైతు ఖాతాకు జమ చేస్తుందన్నారు. త్వరలో పాడి పశువులకు ఉచితంగా గాలి కుంటువ్యాధికి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది ప్రతాప్, శాంతి, మునీంద్ర, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీడీ

బాధ్యతలు చేపట్టిన వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్

మదనపల్లె టౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మదనపల్లె మండలం చీకిలబైలు సర్పంచ్ ఎం.ప్రభాకర్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ ఆధ్వర్యంలో ఎనిమిది మంది డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకులు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే వాల్మీకి కార్పొరేషన్ ద్వారా అన్ని రంగాల్లో వాల్మీకులు ఎదిగేందుకు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు.



చైర్‌పర్సన్ బొజ్జమ్మ ఆధ్వర్యంలో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేత

ములకలచెరువు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మంగళవారం కలిశారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం ద్వారా విన్నవించారు.



మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎస్టీసెల్ కార్యదర్శి

పెద్దమండ్యం, జనవరి 7(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడలోని మంత్రి నివాసంలో మంత్రిని కలిసి గిరిజన ప్రత్యేక గ్రామ పంచాయతీలకు అభివృద్ధి నిధులు కేటాయించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. అలాగే టీడీపీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలను నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. తంబళ్లపల్లి సమస్యలు, రాజకీయ పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. గిరిజన నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో మనోహర్‌నాయక్

హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల్లో హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి తేజశ్వి, వైద్యుడు రిచర్డ్స్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌ఎంపీవీ వైరస్ నియంత్రణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..హెచ్‌ఎంపీవీ వైరస్ సోకితే.. కొవిడ్ వైరస్ తరహాలోనే జలుబు, దగ్గు, జ్వరం, నీరసం వంటి లక్షణాలుంటాయన్నారు. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లలో ఈ లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు బయట తిరిగేటప్పుడు తప్పనిసరిగా మాస్కు ధరించాలని గుంపులు, గుంపులుగా నిలబడటం వంటివి చేయరాదన్నారు. చేతులను తరచూ కడుక్కోవడంతో పాటు, శానిటైజర్‌ను వాడాలన్నారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులకు మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అపోహలు వీడి ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బయటి రాష్ట్రాలలో హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల వస్తున్న వదంతులు తప్ప ఎలాంటి నిజం లేదన్నారు. స్థానిక ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితులలో సైతం వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పదిపడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే కొరత లేకుండా ఆక్సిజన్ ప్లాంట్, వెంటిలేటర్లు, మాస్కులు, మందులు అన్నీ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. దగ్గు, జలుబు, ఆయాసం ఎక్కువగా ఉండి ఇబ్బందులు కలిగితే ఆస్పత్రిలో చేరి చికిత్సలు చేయించుకోవాలన్నారు. వైరస్ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, శానిటైజర్ వాడకం, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

పీలేరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండు చేశారు. ప్రభుత్వం వద్ద నిధుల కొరత ఉన్న కారణంగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయని వారన్నారు. విద్యార్థులకిచ్చిన హామీలు నెరవేర్చనందుకు నిరసనగా పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ మంగళవారం వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మాదవ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీఎల్ వెంకటేష్‌లు మాట్లాడుతూ బకాయిలు చెల్లిస్తామని ఎప్పటికప్పుడు హామీ ఇస్తున్న ప్రభుత్వం మాట నెరవేర్చడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు పునీత్, వినోద్, భవిత, డేవిడ్, జగదీశ్వర్ రెడ్డి, గోవర్ధన్, సురేష్ నాయుడు, రెడ్డికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బాలికల ఉన్నత పాఠశాలకు క్రీడాసామగ్రి వితరణ

బి.కొత్తకోట, జనవరి 07(ఆంధ్రజ్యోతి):బి.కొత్తకోట మండలంలోని బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థులకు మదనపల్లె వేదికగా నున్న బంగారునగల షోరూం జోస్‌అలూక్కాస్ యాజమాన్యం రూ.60వేల విలువ వైనన క్రీడాసామగ్రిని మంగళవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ మేనేజర్ అలెక్స్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని, శారీరకధృడత్వడత్వం పెంపొందించుతాయన్నారు. విద్యార్థులు వాలీబాల్, త్రోబాల్, క్యారమ్స్, షటిల్ వంటి క్రీడలకు కావాల్సిన సదుపాయాలను కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్, పీఈటీ రాజేశ్వరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



రూ.60వేల చెక్కును అందజేస్తున్న జోస్ అలూక్కాస్ మేనేజర్ అలెక్స్

ఏపీకి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

మదనపల్లె అర్బన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):ఏపీకి ఇచ్చిన హామీలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆమేరకు మంగళవారం మదనపల్లె పట్టణం, నీరుగుట్టువారిపల్లెలోని టమోటా మార్కెట్ ఎదుట సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు పదేళ్ల క్రితమే హామీ ఇచ్చినా ఇంత వరకు నెరవేర్చలేదని ఆరోపించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి కార్మికులు, ప్రజలు రెండేళ్లుగా పోరాటాలు చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాగే తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై- విశాఖ పారిశ్రామిక కారిడార్, అనంతపురం జిల్లా కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. బీజేపీ చేస్తున్న అన్యాయాలపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, నరసింహులు, జయబాబు, శ్రీరాములు, నాగరాజు, పిపిరెడ్డి, ఆర్ఫిద్, రమణ, తదితరులు పాల్గొన్నారు.



స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కుల నిర్మూలన సభను జయప్రదం చేయండి

పీలేరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాలలో భాగంగా ఈనెల 12న మదనపల్లెలో నిర్వహించనున్న కుల దహనం, కుల నిర్మూలన చైతన్య సభను జయప్రదం చేయాలని బాస్ జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం పీలేరు బాస్ కార్యాలయంలో స్థానిక సంఘ నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను, అంబేడ్కర్ కుల నిర్మూలన ఉద్యమాన్ని బీజేపీ తిరోగమనం వైపు మళ్లించిందన్నారు. ఇందులో భాగంగానే 12న జరిగే మహాసభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, హరినాథ్, మల్లికార్జున, గురవయ్య, నాగభూషణ పాల్గొన్నారు.